# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

28.03.2026 శనివారం Satrday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 247 | పేజీలు : 10 Pages : 10 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789





నేడు గంట పాటు కరెంటు బంద్

# ఎర్త్ అవర్!

భూమాతకు మనమిచ్చే బహుమతి..

## రాత్రి ఎనిమిదిన్నర నుంచి చీకట్లోకి..

- సిడ్నీలో పుట్టి విశ్వవ్యాప్తమైన ఉద్యమం..
- భూతాపంపై పోరుకు మహా సంకల్పం

3

పెరుగుతున్న కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న భూగోళానికి కాస్త ఉపశమనం కలిగించేలా ప్రతి ఏడాదీ మార్చి చివరి శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ దీపాలను ఆర్పేసి, ప్రకృతితో మనకున్న బంధాన్ని చాటుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన ఆవశ్యకతను ఈ ఎర్త్ అవర్ గుర్తుచేస్తోంది.



## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

25న పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటిస్తా

మేడ్చల్ మునీరాబాద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా

శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన

.. వివరాలు 2లో

# పెట్రోల్ ఫుల్

- అవసరానికి మించి అందుబాటులో ఇంధనం
- గణాంకాలను వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం
- వదంతులు నమ్మవద్దని ప్రజలకు భరోసా
- బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదు

2



## మూడ్రోజుల్లో ఈదురుగాలుల వర్షం

తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక

2



## లాక్‌డౌన్ వార్తలు అవాస్తవం



- సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దు
- చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం లేదు
- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి
- ప్రజలు ప్రశాంతంగా, ఐక్యంగా ఉండాలని విజ్ఞప్తి

.. వివరాలు 4లో




# ఇంధన సంక్షోభంపై ప్రధాని మోదీ భేటీ

- సీఎంలతో అత్యవసర చర్చలు
- హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల నేపథ్యంలో 'టీమ్ ఇండియా' స్పిరిట్
- పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు ఆదేశం
- కోవిడ్ తరహాలోనే కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చిన ప్రధాని
- చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా పలువురు ముఖ్యమంత్రుల భాగస్వామ్యం

పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం దేశంలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతర్జాతీయ సంక్షోభం కారణంగా భారత్‌పై పడే ప్రభావాన్ని ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధంగా ఉండాలని ప్రధాని కోరారు.

మిగతా 2 లో

# కమనీయం సీతారాముల కల్యాణం

కనుల పండువగా కల్యాణోత్సవం | భారీగా హాజరైన ప్రజలు






పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు

- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..
- భారీగా హాజరైన ప్రజలు
- పలువురు మంత్రులు, ప్రముఖుల రాక

**భద్రాచలం, మార్చి 27:** భద్రాచలంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలతో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా కొనసాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రభుత్వం తరపున సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది.

మిగతా 2 లో

"శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రిలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా, కమనీయంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ లోక కల్యాణార్థం సాగిన ఈ వేడుకను వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపంలో అభిజిత్ లగ్నంలో సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేయడంతో భక్తజనం పులకించిపోయింది."



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | శనివారం 28 మార్చి 2026



# ఇంధన సంక్షోభంపై మోదీ భేటీ

**న్యూఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం దేశంలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతర్జాతీయ సంక్షోభం కారణంగా భారత్‌పై పడే ప్రభావాన్ని ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధంగా ఉండాలని ప్రధాని కోరారు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల సీఎంలు మినహా దాదాపు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారం అత్యవసరమని ప్రధాని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ మరియు ఎరువుల సరఫరాలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. "గతంలో కోవిడ్ మహమ్మారిని ఏ విధంగానైతే సమష్టిగా ఎదుర్కొన్నామో, ఇప్పుడు తలెత్తిన తాజా పరిస్థితులను కూడా అదే 'టీమ్ ఇండియా' స్పిరిట్‌తో అధిగమించాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా, కృత్రిమ కొరత సృష్టించకుండా రాష్ట్రాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్న తరుణంలో, సామాన్యుడిపై భారం పడకుండా రాష్ట్రాలు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది.

# ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

**25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన**



**నిజామాబాద్, మార్చి 27:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జిల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

# మూడ్రోజుల్లో ఈదురుగాలుల వర్షం

**తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక**

**హైదరాబాద్, మార్చి 27:** వేసవి భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఉపశమనం కలిగించే వార్తను అందించింది. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుందని అంచనా వేసింది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణపై ప్రస్తుతం ఉన్న వాతావరణ ద్రోణి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మరఠ్వాడా నుంచి కర్ణాటక తీరం వరకు సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీని ఫలితంగా శుక్ర, శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే.. ఈ ఉపశమనం తాత్కాలికమేనని, వచ్చే వారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికం కావచ్చని అధికారులు వెల్లడించారు.

# కమనీయం.. సీతారాముల కల్యాణం

మొదటి పేజీ తరువాయి

మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.







# తెలంగాణలో ఫుల్‌గా పెట్రో నిల్వలు!

- అవసరానికి మించి అందుబాటులో ఇంధనం
- గణాంకాలను వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం
- వదంతులు నమ్మవద్దని ప్రజలకు భరోసా
- బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదు

**హైదరాబాద్, మార్చి 27:** తెలంగాణ రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27వ తేదీ నాటి అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టమైంది. సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ అవసరమయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.

**పెట్రోల్ నిల్వలు పుష్కలం**

పెట్రోల్ వినియోగాన్ని పరిశీలిస్తే రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే మార్చి 26వ తేదీ నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్ ను సరఫరా చేశారు. అంటే సాధారణ డిమాండ్ కంటే 182 శాతం అధికంగా పెట్రోల్ అందుబాటులో ఉంది. అదేవిధంగా రవాణా, వ్యవసాయ రంగాలకు అత్యంత కీలకమైన డీజిల్ సరఫరా కూడా ఆశాజనకంగా ఉంది. రోజువారీ సగటు అవసరం 7,348 కిలో లీటర్లు కాగా ప్రభుత్వం ఏకంగా 19,580 కిలో లీటర్లను సరఫరా చేసింది. ఇది సాధారణ డిమాండ్ కంటే 167 శాతం ఎక్కువ.

**వదంతులు నమ్మవద్దు**

మొత్తంగా చూస్తే రాష్ట్రవ్యాప్తంగా ఇంధన అవసరాలు తీర్చడానికి అవసరమైన సగటు 13,231 కిలో లీటర్లు అయితే ప్రస్తుతం సరఫరా అవుతున్న పరిమాణం 36,189 కిలో లీటర్లుగా నమోదైంది. ఈ గణాంకాలను బట్టి చూస్తే



రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, సరఫరా వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని, ఇంధనం కోసం కంగారుపడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ఇంధన సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

# మంత్రి జూపల్లికి అంతర్జాతీయ శాంతి పురస్కారం



- బౌద్ధ వారసత్వ పరిరక్షణకు దక్కిన ప్రపంచ గుర్తింపు
- బుద్ధవనం ఇక 'వరల్డ్ పీస్ సెంటర్'
- 22 దేశాల ప్రతినిధుల సమక్షంలో పురస్కార ప్రదానం

**హైదరాబాద్, మార్చి 27:** విద్వేషాలు, విభేదాలతో సతమతమవుతున్న ఆధునిక ప్రపంచానికి గౌతమ బుద్ధుని కరుణ, అహింసలే మార్గదర్శకాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని హరిత ప్లాజాలో జరిగిన అంతర్జాతీయ బౌద్ధ శాంతి సదస్సు 2026లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ వారసత్వ పరిరక్షణ, ప్రపంచ శాంతి స్థాపనలో, అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడిలో మంత్రి చూపుతున్న చొరవను గుర్తిస్తూ ఇంటర్నేషనల్ ఇంటర్ ఛేంజ్ డెవలప్ మెంట్ అసోసియేషన్ ఆయనకు ప్రతిష్టాత్మకమైన 'గ్రాండ్ ప్రైజ్ ఫర్ కాంట్రిబ్యూషన్ టు వరల్డ్ పీస్' అవార్డును ప్రదానం చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు మున్ యోంగ్ జో ఈ పురస్కారాన్ని అందజేస్తూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారికి ఆసరాగా నిలుస్తూ మానవ విలువల కోసం కృషి చేస్తున్న మంత్రి సేవలను కొనియాడారు. ఈ అవార్డు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న శాంతి, అహింస విలువలకు లభించిన గుర్తింపు అని మంత్రి తెలిపారు.

**బౌద్ధ వైభవానికి నిలయం**

తెలంగాణ గడ్డ వేల ఏళ్లుగా బౌద్ధ వైభవానికి నిలయమని మంత్రి గుర్తుచేశారు. కృష్ణా నదీ తీరాన ఆచార్య నాగార్జునుడు మాధ్యమిక వాదాన్ని, శూన్యతా సిద్ధాంతాన్ని ప్రవచించి ఈ ప్రాంతాన్ని విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఫణిగిరి, నేలకొండపల్లి, ధూళికట్ట, కోటిలింగాల వంటి చారిత్రక ప్రదేశాలు కేవలం పురావస్తు కేంద్రాలు మాత్రమే కావని, అవి మన మహోజ్వల నాగరికతకు సజీవ సాక్ష్యాలని అభివర్ణించారు. ఈ చారిత్రక క్షేత్రాల సంరక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సమగ్ర బౌద్ధ పర్యాటక వలయాన్ని రూపుదిద్దుతూ యాత్రికులకు ప్రపంచ స్థాయి అనుభవం కల్పించనున్నట్లు వెల్లడించారు.

**గ్లోబల్ పీస్ సెంటర్ గా బుద్ధవనం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక చిత్రపటంలో అగ్రగామిగా నిలబెడతామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. నాగార్జున సాగర్ వద్ద 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ఇకపై గ్లోబల్ పీస్ సెంటర్ గా విరాజిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుద్ధవనం ప్రాజెక్ట్ నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ శాంతి దిశగా కొత్త పుంతలు తొక్కుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీలంక బౌద్ధ శాసన మంత్రి ప్రొఫెసర్ హినిదుమ సునీల్ సేనెవి, వియత్నాం ప్రతినిధి డాక్టర్ తిచ్ నాత్ తు, బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ మల్లేపల్లి లక్ష్మయ్య, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, సదస్సు కోఆర్డినేటర్ శివనాగి రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు 22 దేశాల నుంచి వచ్చిన 150 మంది ప్రతినిధులు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

# బస్సు ప్రమాద కేసులో యజమాని అరెస్ట్

- నెల్లూరుకు పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు
- ప్రమాద సమయంలో డ్రైవింగ్ సీటులో హరికృష్ణారెడ్డే
- నిందితుడిని మార్కాపురం పోలీస్ స్టేషన్ కు తరలింపు



**మార్కాపురం, మార్చి 27:** మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్సు యజమాని, డ్రైవర్ పి. హరికృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రాయవరం వద్ద గురువారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు - కంకర టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సు ప్రమాద సమయంలో హరికృష్ణారెడ్డి డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులను గాలికొదిలేసి హరికృష్ణారెడ్డి పరారయ్యాడు. నెల్లూరుకు పారిపోతుండగా గురువారం సాయంత్రమే పామూరు శివారులో పోలీసులు అతడిని పట్టుకున్నారు. నేడు సాయంత్రం మార్కాపురం పోలీస్ స్టేషన్ కు తరలించే అవకాశం ఉంది.

# భూమాతకు మనమిచ్చే బహుమతి..

రాత్రి ఎనిమిదిన్నర నుంచి చీకట్లోకి..

# ఎర్త్ అవర్!

## నేడు గంట పాటు కరెంటు బంద్



### సిడ్నీలో పుట్టి విశ్వవ్యాప్తమైన ఉద్యమం.. భూతాపంపై పోరుకు మహా సంకల్పం

**హైదరాబాద్, మార్చి 27:** మారుతున్న కాలం, పెరుగుతున్న కాలుష్యం మూలంగా భూమండలం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఈ విపత్కర పరిస్థితుల నుంచి మన భూమిని కాపాడుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన అద్భుతమైన కార్యక్రమమే ఎర్త్ అవర్. ప్రతి ఏడాదీ మార్చి నెల చివరి శనివారం(నేడు) రాత్రి ఎనిమిది గంటల ముప్పై నిమిషాల నుంచి తొమ్మిది గంటల ముప్పై నిమిషాల వరకు దీన్ని నిర్వహిస్తారు. ఈ సంవత్సరం మార్చి ఇరవై ఎనిమిదో తేదీన ఎర్త్ అవర్ జరుపుకునేందుకు ప్రపంచ దేశాలు సిద్ధమయ్యాయి. భూమిపై ఉన్న ప్రాణకోటి మనుగడకు అత్యంత కీలకమైన పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏటా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పాటిస్తున్నారు.

#### ఆస్ట్రేలియాలో అంకురార్పణ

ఈ అద్భుతమైన ఆలోచనకు రెండు వేల ఏడులో బీజం పడింది. ప్రకృతి పరిరక్షణ కోసం పని చేసే అంతర్జాతీయ సంస్థ వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో తొలిసారిగా ఈ ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆ సమయంలో వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గంట పాటు విద్యుత్ దీపాలను ఆర్పేయాలని పిలుపునిచ్చారు. అప్పట్లో కేవలం ఒక నగరానికి మాత్రమే పరిమితమైన ఈ కార్యక్రమం ఆ తర్వాతి కాలంలో ప్రపంచమంతటా విస్తరించింది. ఇప్పుడు సుమారు నూటా తొంభైకి పైగా దేశాలు, వందలాది నగరాలు ఈ ఎర్త్ అవర్ లో స్వచ్ఛందంగా పాల్గొంటున్నాయి.

#### మేల్కోవాల్సిన సమయం

ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం కేవలం గంట పాటు కరెంటు ఆదా చేయడం మాత్రమే కాదు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, ప్రకృతి వనరుల విచక్షణా రహిత వినియోగం వల్ల భవిష్యత్తు తరాలకు ఎదురుకాబోయే ముప్పును ప్రజలకు తెలియజెప్పడమే దీని అసలు లక్ష్యం. వాతావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల అకాల వర్షాలు, వరదలు, కరువులు లాంటి ప్రకృతి విపత్తులు ఏటేటా పెరుగుతూ వస్తున్నాయి. అడవులు అంతరించిపోతుండటం, వన్యప్రాణులు ఉనికిని కోల్పోతుండటం ఆందోళన కలిగించే విషయాలు. ఇలాంటి తరుణంలో మానవాళి మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎర్త్ అవర్ అనేది కేవలం చీకట్లో కూర్చోవడం కాదని, భవిష్యత్ తరాలకు సురక్షితమైన రేపటిని అందించేందుకు మనం చేయాల్సిన ప్రయత్నాలకు ఒక ప్రతీక అని నిపుణులు చెబుతున్నారు. పెట్రోల్, బొగ్గు లాంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు మళ్లడం లాంటి విషయాలపై ఈ ఎర్త్ అవర్ ద్వారా గట్టి సందేశాన్ని ఇస్తున్నారు. ప్రకృతితో మనం మమేకమై బతకాల్సిన అవసరాన్ని ఈ ఒక్క గంట సమయం మనకు గుర్తు చేస్తుంది.

> భూమాత రక్షణ కోసం యావత్ ప్రపంచం ఒక్కటయ్యే సమయం ఆసన్నమైంది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై పోరాటానికి ప్రతీకగా నిలిచే ఎర్త్ అవర్‌కు సర్వం సిద్ధమైంది. పెరుగుతున్న కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న భూగోళానికి కాస్త ఉపశమనం కలిగించేలా ప్రతి ఏడాదీ మార్చి చివరి శనివారం నిర్వహించే ఈ బృహత్తర కార్యక్రమానికి సన్నాహాలు పూర్తయ్యాయి. నేడు రాత్రి ఎనిమిది గంటల ముప్పై నిమిషాల నుంచి తొమ్మిది గంటల ముప్పై నిమిషాల వరకు గంట పాటు విద్యుత్ దీపాలను ఆర్పేసి, ప్రకృతితో మనకున్న బంధాన్ని చాటుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన ఆవశ్యకతను ఈ ఎర్త్ అవర్ గుర్తుచేస్తోంది.

#### మనం చేయాల్సిందిదే..

ఈ ఎర్త్ అవర్ సందర్భంగా ప్రజలు చేయాల్సిన పని చాలా చిన్నదే అయినా అది సృష్టించే ప్రభావం మాత్రం చాలా పెద్దది. శనివారం రాత్రి ఎనిమిదిన్నర నుంచి తొమ్మిదిన్నర వరకు ఇళ్లలో, కార్యాలయాల్లో అత్యవసరం కాని విద్యుత్ దీపాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఆపివేయాలి. టీవీలు, కంప్యూటర్లు, అలంకరణ కోసం వేసే లైట్లను ఆపేసి చీకటిని ఆస్వాదించాలి. కుటుంబ సభ్యులతో కలిసి ఆరుబయట కూర్చోవడం, కొవ్వొత్తుల వెలుతురులో కబుర్లు చెప్పుకోవడం లాంటివి చేయొచ్చు. దీనివల్ల మనసుకు ప్రశాంతత దొరకడమే కాకుండా పర్యావరణానికి మన వంతు మేలు చేసిన సంతృప్తి మిగులుతుంది. పౌరులంతా తమ వంతు సామాజిక బాధ్యతగా ఈ ఎర్త్ అవర్ లో పాల్గొని భూమాతపై తమకున్న ప్రేమను చాటుకోవాలి.



# ఇరాన్‌పై దాడులు తీవ్రం

- జనావాసలపై దాడిలో 26మంది మృతి

**టెహ్రాన్,మార్చి 27:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని ఇస్ఫాహాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. నివాసాలపై దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది మరణించినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారని పేర్కొంది. గత నెల 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేసింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కష్టాలు మొదలయ్యాయి. ఇక హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. అంతేకాకుండా ఇజ్రాయెల్, అమెరికా మిత్రదేశాలకు చెందిన ఆయిల్ ట్యాంకర్లను విడిచిపెట్టబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు

#### సీఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**న్యూఢిల్లీ, మార్చి 27:** నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

# ఎక్సైజ్ సుంకం తగ్గించడం శుభవార్త


#### మోడీకి కృతజ్ఞతలు తెలిపిని రామచంద్రరావు



**హైదరాబాద్, మార్చి 27:** ప్రధాని నరేంద్ర మోడీ శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడం ఒక సాహసోపేతమైన నిర్ణయమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అభివర్ణించారు. దేశ ప్రజలకు తీపి కబురు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగు తున్నప్పటికీ, సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, జనరంజకమైన నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఏకంగా 'సున్నా' స్థాయికి తగ్గించడం పెట్రోల్‌పై కూడా రూ. 10 భారాన్ని తగ్గించి కేంద్రం తన బాధ్యతను చాటుకుందని తెలిపారు. ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను ఎప్పుడు నెరవేరుస్తుందని రాంచందర్ రావు ప్రశ్నించారు.

# కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

- మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ, మార్చి 27:** కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు. న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జీలను మినహాయించకుండా, వారిని కేటాయించడం ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లోని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జీలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జీలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

# నటుడు రాహుల్ సోదరుడి మృతి

#### పారాక్వాట్ గడ్డి మందుతో విషాదం
#### తక్షణమే నిషేధించాలని ప్రభుత్వాలకు విన్నపం
#### సోషల్ మీడియా వేదికగా నటుడి ఆవేదన



**హైదరాబాద్, మార్చి 27:** ప్రముఖ నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. పారాక్వాట్ అనే ప్రమాదకర గడ్డి మందు ప్రభావంతో ఆయన సోదరుడు మరణించారు. ఈ విషాద వార్తను రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్ లో సులభంగా అందుబాటులో ఉండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషం వల్ల సంభవించే మరణాలను చూసి వైద్యులు సైతం దిగ్భ్రాంతి చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ పీఎంఓ, తెలంగాణ సీఎంఓ కార్యాలయాలకు బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ కు విరుగుడు లేకపోవడం వల్ల అది శరీరంలోకి వెళ్లిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా వాడుతున్నారని వివరించారు. మరిన్ని ప్రాణాలు పోకుండా ఈ ప్రాణాంతక మందును తక్షణమే నిషేధించాలని కోరారు. ఇప్పటికే పలు దేశాల్లో నిషేధానికి గురైన ఈ రసాయనంపై భారత్ లో కూడా ఆంక్షలు విధించాలనే డిమాండ్ కు నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.




సంపాదకీయం

# ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం

పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంద. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవుతోంది. పశ్చిమాసియా యుద్ద పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరా÷-పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయ గలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగ దారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగు తుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది. దీనికితోడు రూపాయి కనిష్ట స్థాయికి పడిపోతోంది. మారకం విలువ పడిపోవడం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత ఆందోళనకరంగా ఉండనుంది.

# అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

- బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం
- తిలకించి, పులకించిన భక్తజనం

**అయోధ్య, మార్చి 27:** శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది.




ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆప÷-టో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ఎ÷-లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

# లాక్‌డౌన్ వార్తలు అవాస్తవం

- సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దు
- చమురు, గ్యాస్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేదు
- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి
- ప్రజలు ప్రశాంతంగా, ఐక్యంగా ఉండాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, మార్చి 27 (మనసులో మాట):** దేశంలో మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్న ప్రచారానికి కేంద్ర ప్రభుత్వం తెరదించింది. దేశవ్యాప్త లాక్‌డౌన్ విధిస్తారన్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి శుక్రవారం స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద అటువంటి ప్రతిపాదన ఏదీ లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆయన తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో క్లారిటీ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ కొరత వంటి సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని, అందరం సన్నద్ధంగా ఉండి కలిసికట్టుగా అధిగమించాలని పిలుపునిచ్చారు. అయితే, ఈ వ్యాఖ్యలను కొందరు తప్పుగా అన్వయించుకుంటూ, దేశంలో మళ్లీ లాక్‌డౌన్ తప్పదంటూ నెట్టింట పుకార్లు సృష్టించారు. ముఖ్యంగా ఎల్పీజీ సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. గ్లోబల్ పరిస్థితులు మారుతున్నప్పటికీ, ప్రధాని మోదీ నేతృత్వంలో ఇంధనం, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు



తీసుకుంటోందని మంత్రి భరోసా ఇచ్చారు. "ప్రపంచ పరిస్థితి నిరంతరం మారుతూనే ఉంది, కానీ ప్రజల రాకపోకలపై గానీ, ఆర్థిక కార్యకలాపాలపై గానీ ఆంక్షలు విధించే ప్రణాళికలు లేవు" అని అధికారులు వివరించారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రజలు ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి హితవు పలికారు.

# వివాహితుడితో లివ్-ఇన్ నేరం కాదు

## అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు



**లక్నో, మార్చి 27:** వయోజనులైన స్త్రీ-పురుషులు పరస్పర అంగీకారంతో సహజీవనం చేయడం నేరం కాదని అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. వివాహితుడైన పురుషుడు మరో వయోజన మహిళతో కలిసి ఉన్నా, అది చట్టపరంగా నేరం కిందికి రాదని స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌కు చెందిన అనామిక, నేత్రపాల్ జంట తమ సహజీవనానికి రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనా ధర్మాసనం పిటిషనర్లకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. వారిని అరెస్టు చేయవద్దని పోలీసులకు ఆదేశించింది. "సామాజిక నైతికత ఒకటి, చట్టం మరోటి. పౌరుల హక్కులను కాపాడే విషయంలో కోర్టులు సామాజిక అభిప్రాయాలకు బంధింపబడవు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇద్దరు వయోజనులు ఇష్టపూర్వకంగా కలిసి జీవిస్తే, చట్టం అడ్డుకోదని పేర్కొంది. అనామిక తల్లి ఫిర్యాదు ఆధారంగా నేత్రపాల్‌పై కేసు నమోదైనప్పటికీ, అనామిక తాను మేజర్ అని, స్వచ్ఛందంగా అతనితోనే ఉంటున్నానని పోలీసులకు తెలిపింది.

### జంటకు రక్షణ.. కుటుంబానికి హెచ్చరిక

పిటిషనర్లకు ప్రాణహాని ఉందని కోర్టుకు తెలియజేయడంతో, వారి భద్రతకు స్థానిక పోలీస్ సూపరింటెండెంట్ బాధ్యత వహించాలని ఆదేశించింది. అలాగే కుటుంబ సభ్యులు నేరుగా గానీ, ఇతర మార్గాల్లో గానీ జంటను సంప్రదించవద్దని హెచ్చరించింది. 2018లోని శక్తి వాహిని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని పోలీసులకు సూచించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 8కి వాయిదా వేసింది. అప్పటివరకు జంటకు పూర్తి రక్షణ కల్పించాలని ఆదేశించింది.

# ఎరువుల కొరత లేదు

## తగినన్ని నిల్వలు ఉన్నాయి.. • లోక్‌సభలో జెపి నడ్డా వెల్లడి

**న్యూఢిల్లీ, మార్చి 27:** దేశంలో ఎరువుల కొరత లేదని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభకు తెలిపారు. దేశంలో అవసరమైన నిల్వలు ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు. ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో నిత్యావసరాలు, ఎరువుల సరఫరా గురించి చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్ వరకూ ఎరువులకు కొరత ఉండదు. కానీ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల వాడకంలో భారత్ రెండో అతిపెద్ద దేశం. ఫెర్టిలైజర్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఎల్ఎన్‌జీ ధరల పెరుగదల కారణంగా యూరియా ఉత్పత్తి వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. అదే సమయంలో, ఎరువులు, ముడి పదార్థాల రవాణా ఆలస్యం అవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.



# యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

## సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ


## పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంక్ తగ్గించిన కేంద్రం

## పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 తగ్గింపు

**న్యూఢిల్లీ,మార్చి 27 :** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ..



చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.




**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):**

"జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో భారీ స్థాయిలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారిక విచారణలో తేలింది. జరిగిన దుర్వినియోగం ఒక్కటే విధంగా కాకుండా అనేక రూపాల్లో, వివిధ ఖాతాలు.. లావాదేవీల ద్వారా జరిగినట్లు విచారణలో బయటపడింది. అధికారుల నివేదిక ప్రకారం ప్రతి అంశాన్ని పరిశీలిస్తే వ్యవస్థలోని లోపాలను ఉపయోగించుకుని పద్ధతిగా నిధులు మళ్లించిన తీరు స్పష్టమవుతోంది.మాజీ సీఈఓ దీకొండ కిషన్‌పై రూ.1.01 కోట్లకు పైగా సర్‌చార్జ్ విధిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేయడం ఈ వ్యవహారాన్ని మరింత సంచలనంగా మార్చింది. కాగా, సస్పెండైన 'స్వాహా'ధికారి నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండానే.. మళ్లీ యథాస్థానంలోకి 'పోస్టింగ్' ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఈసారి గుడిలో లింగాన్ని కాదు.. ఏకంగా గుడినే మింగేస్తాడేమోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.!"

# సహకార శాఖలో స్వాహాధికారి!

## అయిలాపూర్ 'పాక్స్'లో భారీ దుర్వినియోగం - నిర్ధారణ!

### రూ.1.01 కోటి గల్లంతు.. మాజీ సీఈఓపై సర్-చార్జ్ ఆర్డర్ జారీ

## సెక్షన్ 51 విచారణలో బయటపడ్డ అవినీతి

**సెక్షన్ 60 కింద సర్-చార్జ్.. 18% వడ్డీతో వసూలు చేయాలని ఆదేశాలు**

**రుణాలు, ఎరువుల విక్రయాలు, నగదు లావాదేవీల్లో అక్రమాలు**

**పలుమార్లు అవకాశమిచ్చినా క్రాస్ ఎగ్జామినేషన్ వినియోగించుకోలేదన్న అధికారులు**

**కోటి రూపాయలు స్వాహా చేసిన అధికారికే మళ్లీ 'యథాస్థానం'లో 'పోస్టింగ్'!**

**'రికవరీ' చేయకుండానే మళ్లీ పోస్టింగ్ ఇస్తే.. ఈసారి 'ప్యాక్స్'నే మింగేసే ఛాన్స్? అయిలాపూర్‌వాసుల తీవ్ర 'అభ్యంతరం'.!**

### విచారణలో బయటపడిన నిజాలు

తెలంగాణ సహకార సంఘాల చట్టం, 1964లోని సెక్షన్ 51 కింద నిర్వహించిన విచారణలో వెల్లడైంది.అయిలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన దుర్వినియోగం వివరాలు లెక్కలతో పరిశీలిస్తే, ప్రతి విభాగంలో ఎలా నిధులు మళ్లించబడ్డాయో స్పష్టంగా బయటపడుతోంది. అధికారిక సర్‌చార్జ్ ఉత్తర్వుల ప్రకారం అంశాలవారీగా ఇలా ఉంది. అసిస్టెంట్ రిజిస్ట్రార్ సమర్పించిన నివేదిక ప్రకారం మాజీ సీఈఓ దీకొండ కిషన్ రూ.91.88 లక్షల మేర నిధులను దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ అయింది. అనంతరం రికార్డుల పరిశీలనలో మరో రూ.9.42 లక్షల అనుమానాస్పద లావాదేవీలు బయటపడటంతో మొత్తం మొత్తం రూ.1,01,30,949కు చేరింది.

### సర్‌చార్జ్ ప్రక్రియ - పలుమార్లు నోటీసులు

ఈ వ్యవహారంపై జిల్లా సహకార అధికారి కార్యాలయం నుంచి పలుమార్లు సెక్షన్ 60 కింద నోటీసులు జారీ అయ్యాయి. సంబంధిత వ్యక్తికి వివరణ ఇచ్చుకునే అవకాశాలు కల్పించడంతో పాటు రికార్డులు పరిశీలించేందుకు సమయం కూడా ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్రాస్ ఎగ్జామినేషన్ కోసం పలుమార్లు తేదీలు కేటాయించినప్పటికీ, ఆ అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేదని అధికారులు తెలిపారు.

### రుణాల వ్యవహారాల్లో భారీ అక్రమాలు

సహకార సంఘ సభ్యులకు ఇచ్చిన వ్యక్తిగత రుణాలు, వాహన రుణాలు, చిన్న రుణాల కింద మొత్తం ₹11,71,013 దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. అదనంగా సభ్యులు చెల్లించిన రుణాల నమోదు లోపాల వల్ల ₹16,75,551 లోటు ఏర్పడింది. వ్యక్తిగత రుణాల మంజూరు, వసూళ్లలో సరైన నమోదు చేయకుండా కొంత మొత్తాన్ని వ్యక్తిగతంగా వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా సభ్యులు చెల్లించిన రుణాల వసూళ్లు పూర్తి స్థాయిలో ఖాతాల్లో నమోదు కాకపోవడం వల్ల భారీ లోటు ఏర్పడింది.

### రికార్డులలో తారుమారులు-మిస్ ఎంట్రీలు

సంఘ సభ్యుల నుంచి వచ్చిన డబ్బులను ఖాతాల్లో సక్రమంగా నమోదు చేయకుండా, కొంత భాగాన్ని 'మిస్ ఎంట్రీ'గా లేదా 'పార్టియల్ ఎంట్రీ'గా చూపించడం ద్వారా నిధులు మాయమయ్యేలా చేసినట్లు విచారణలో తేలింది. ఈ విధానం ద్వారా చిన్న చిన్న మొత్తాలు కలిపి పెద్ద మొత్తంగా మారినట్లు అధికారులు గుర్తించారు.

### వ్యవసాయ కొనుగోళ్లలో అవకతవకలు

ప్యాడీ (వరి) కొనుగోలు ఖర్చులు వౌచర్లు లేకుండా చూపించడం ద్వారా ₹12,35,006 మళ్లించబడింది. మక్కజొన్న కొనుగోళ్లలో ₹88,000 అక్రమాలు చోటుచేసుకున్నాయి. మక్కజొన్న కొనుగోళ్లలో గందరగోళం సృష్టించడంవంటి అంశాలు బయటపడ్డాయి. వాస్తవంగా ఖర్చు కానిది ఖర్చు చేసినట్లు చూపించారని నివేదిక చెబుతోంది.

### ఎరువుల విక్రయాల్లో గందరగోళం

ఎరువుల విక్రయాల డబ్బులు పూర్తిగా సంఘ ఖాతాల్లో జమ కాకపోవడం, కొంత మొత్తాన్ని దాచిపెట్టడం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయి. అదనంగా, కొన్ని ఎరువుల విక్రయాలు విచారణ పరిధిలోకి కూడా రాకపోవడం గమనార్హం. ఈ ఎరువుల విక్రయాల్లో ₹1,14,510 అక్రమాలు గుర్తించారు. అలాగే విచారణలోకి రాని ఎరువుల విక్రయాల ద్వారా మరో ₹4,50,230 బయటపడింది.

### సంఘ ఖాతాల నుంచి నేరుగా డబ్బుల మళ్లింపు

సేవింగ్స్, కరెంట్ ఖాతాల నుంచి నేరుగా డబ్బులు తీసుకుని వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. సంఘ సేవింగ్స్ ఖాతా నుంచి వ్యక్తిగత అవసరాలకు ₹1,50,000 తీసుకున్నట్లు, సేవింగ్స్, కరెంట్ ఖాతాల నుంచి మరో ₹1,97,757 వినియోగించినట్లు గుర్తించారు.

### డబుల్ ఎంట్రీలు, నకిలీ లావాదేవీలు

ఒకే లావాదేవీని రెండు సార్లు నమోదు చేసి నిధులను మళ్లించడం (డబుల్ ఎంట్రీ) వంటి పద్ధతులు ఉపయోగించినట్లు విచారణలో తేలింది. ఈ విధానం ద్వారా ఖాతాల్లో గందరగోళం సృష్టించి నిజమైన లావాదేవీలను దాచిపెట్టినట్లు అధికారులు గుర్తించారు.చెక్కుల ద్వారా తీసుకున్న మొత్తాలను తప్పుడు ఎంట్రీలుగా చూపిస్తూ ₹1,84,500 మళ్లించగా, డబుల్ ఎంట్రీల ద్వారా ₹3,24,200 దుర్వినియోగం చేశారు.

### డిపాజిట్లు-షేర్ క్యాపిటల్‌లో అక్రమాలు

సంఘ సభ్యుల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, షేర్ క్యాపిటల్ రిటర్న్‌లలో కూడా అక్రమాలు చోటుచేసుకున్నాయి. సభ్యులకు ఇవ్వాల్సిన డబ్బులను నిలిపివేయడం లేదా వేరే విధంగా చూపించడం ద్వారా నిధులను మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి.టీఎస్ మార్క్ ఫెడ్ చెల్లింపులలో ₹2,70,000 మళ్లించబడింది. సభ్యుల షేర్ క్యాపిటల్ రిటర్న్‌లలో ₹74,176, ఫిక్స్‌డ్ డిపాజిట్ల చెల్లింపుల్లో ₹1,81,802 దుర్వినియోగం జరిగింది.

### సస్పెన్స్ ఖాతాలు - నగదు లోటు

సస్పెన్స్ ఖాతాల పేరుతో పెద్ద మొత్తాలు చూపించడం, క్యాష్ బ్యాలెన్స్‌లో తేడాలు ఉండడం కూడా ప్రధాన అంశాలుగా బయటపడ్డాయి. ఖాతాల్లో చూపిన నగదుతోపాటు వాస్తవ నగదు మధ్య వ్యత్యాసం ఉండటం దుర్వినియోగానికి స్పష్టమైన సూచనగా అధికారులు భావించారు. ఓపెనింగ్ క్యాష్ బ్యాలెన్స్‌లో తేడా ₹1,87,136గా నమోదైంది. క్యాష్ సస్పెన్స్ ₹11,69,312 చూపించారు. వ్యక్తిగత సస్పెన్స్ ఖాతాలో ₹4,91,816 నమోదు చేశారు.

### ఎఫ్‌పీ షాప్, కమిషన్‌లలో అవకతవకలు

ఫెయిర్ ప్రైస్ షాప్ కమిషన్‌లు, ఇతర సేవల ద్వారా వచ్చిన ఆదాయంలో కూడా అక్రమాలు జరిగాయి. ఈ మొత్తాలు సంఘానికి చేరకుండా మళ్లించినట్లు విచారణలో వెల్లడైంది.ఫెయిర్ ప్రైస్ షాప్ కమిషన్‌లో ₹1,71,957 దుర్వినియోగం జరిగింది.

### పంట రుణాలు - సభ్యుల లావాదేవీలు

క్రాప్ లోన్ల మంజూరులో ₹13,02,625 అక్రమాలు జరిగాయి. సభ్యులకు వౌచర్లు లేకుండా చెల్లింపులు చేయడం ద్వారా ₹5,41,358 దుర్వినియోగం జరిగింది.ఈ అన్ని అంశాలను కలిపి మొత్తం దుర్వినియోగం ₹1,01,30,949గా అధికారులు నిర్ధారించారు. అయితే సర్‌చార్జ్ ఆర్డర్ ప్రకారం ప్రధాన బాధ్యతగా ₹98,57,041ను 18% వడ్డీతో వసూలు చేయాలని ఆదేశించారు. మొత్తంగా చూస్తే, చిన్న చిన్న లావాదేవీల్లో చేసిన అక్రమాలు అంతా కలిపి కోటి రూపాయలకు పైగా దుర్వినియోగంగా మారినట్లు ఈ లెక్కలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

### ₹98.57 లక్షలు వడ్డీతో వసూలుకు ఆదేశాలు

వివిధ ఆరోపణలను పరిశీలించిన అనంతరం, మాజీ సీఈఓ దీకొండ కిషన్ ₹98,57,041 మొత్తాన్ని 18% వార్షిక వడ్డీతో సహా సంఘానికి చెల్లించాల్సిన బాధ్యత వహించాల్సిందిగా జిల్లా సహకార అధికారి తేల్చిచెప్పారు. ఈ మొత్తం దుర్వినియోగం జరిగిన తేదీల నుంచి వడ్డీతో కలిపి వసూలు చేయాలని స్పష్టం చేశారు.

### సహకార వ్యవస్థపై సమాధానం దొరకని ప్రశ్నలు

ఈ సంఘటనతో సహకార సంఘాల పర్యవేక్షణపై సమాధానం దొరకని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో అవినీతి జరిగినప్పటికీ, అది తక్షణం గుర్తించబడకపోవడం, సంవత్సరాల తర్వాత వెలుగులోకి రావడం వ్యవస్థలో లోపాలను చూపిస్తోంది. రైతుల నమ్మకానికి నిలయంగా ఉండాల్సిన సహకార సంఘాలు ఇలాంటి ఘటనలతో విశ్వసనీయత కోల్పోతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### మరి 'స్వాహా'ధికారిపై చర్యలేవీ!?

జిల్లా సహకార అధికారి జారీ చేసిన ఈ సర్‌చార్జ్ ఉత్తర్వులు ఇప్పుడు కీలక దశకు చేరాయి. వాస్తవంగా ఈ మొత్తాన్ని ఎలా వసూలు చేస్తారు.? బాధ్యులపై మరింత కఠిన చర్యలు ఉంటాయా.? అనే అంశాలపై రైతులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ వ్యవహారం పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు కొనసాగాలని స్థానిక వర్గాలు కోరుతున్నాయి.



# భక్తులకు తాగునీటి పంపిణీ

**నేటి సాక్షి, ఆసిఫాబాద్ టౌన్:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండ రామాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం వాసవి క్లబ్ ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో చల్లటి తాగునీటిని పంపిణీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉపశమనం కలిగించే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐ బాలాజీ వరప్రసాద్, 6వ వార్డు కౌన్సిలర్ చిలువేరు వెంకన్న హాజరై భక్తులకు స్వయంగా తాగునీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆసిఫాబాద్ అధ్యక్షులు మర్యాల ఉదయ బాబు, పలువురు వాసవియన్స్ పాల్గొన్నారు.

# గొల్లపల్లి వేడుకల్లో కేటీఆర్

**కల్యాణోత్సవంలో పాల్గొన్న బీఆర్ ఎస్ నేత.. ప్రజల నుంచి ఘన స్వాగతం**

**నేటి సాక్షి, సిరిసిల్ల:** రామ నవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రదాయబద్ధంగా పండితులు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఈ వేడుకల్లో బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన సందర్భంగా కేటీఆర్ కు ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఖమ్మం - బస్తర్ కారిడార్ ను నాలుగు వరుసలుగా మార్చాలి

**కేంద్రానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి**

**తెలంగాణ, ఛత్తీస్ గఢ్ మధ్య పెరగనున్న అనుసంధానం**

**కొత్తగూడెం కేంద్రంగా పారిశ్రామికాభివృద్ధికి బాటలు**

**భద్రత, రవాణా పరంగా అత్యంత కీలకం**




**నేటి సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణ, మధ్య భారతానికి వ్యూహాత్మక జీవనాధారమైన ఖమ్మం – బస్తర్ కారిడార్‌ను వెంటనే నాలుగు వరుసల రహదారిగా విస్తరించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కోరారు. తూర్పు తెలంగాణతో పాటు దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాలలో రవాణా, భద్రత, ఆర్థికాభివృద్ధిపై ఈ రహదారి తీవ్ర చూపుతుందని ఆయన వివరించారు. హై స్పీడ్ కారిడార్ల ద్వారా హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు రహదారి బాగున్నప్పటికీ, ఖమ్మం వెలుపల ఉన్న కొత్తగూడెం, భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల అనుసంధానం నిర్లక్ష్యానికి గురైందని రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## పారిశ్రామిక వెన్నెముకకు ఊతం

ఈ కారిడార్ కేవలం ఒక రహదారి మాత్రమే కాదని, ఇది తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే వ్యూహాత్మక మార్గమని ఎంపీ పేర్కొన్నారు. ఈ నెట్‌వర్క్‌కు కొత్తగూడెం కేంద్ర బిందువుగా మారుతుందని ఆయన వివరించారు. సింగరేణి బొగ్గు క్షేత్రాలు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, ప్రధాన పరిశ్రమలకు నిలయమైన కొత్తగూడెం, పాల్వంచలు తెలంగాణ పారిశ్రామిక, ఇంధన వెన్నెముకగా ఉన్నాయని రవిచంద్ర గుర్తు చేశారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ఖమ్మం దాటిన తర్వాత రహదారి మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడంతో వాహనాలు తరచూ ట్రాఫిక్ రద్దీలో చిక్కుకుంటున్నాయని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

## త్రిరాష్ట్ర లాజిస్టిక్స్ కేంద్రం

ఖమ్మం – కొత్తగూడెం – భద్రాచలం – బస్తర్ మార్గాన్ని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తే కొత్తగూడెం త్రిరాష్ట్ర లాజిస్టిక్స్ కేంద్రంగా రూపుదాలుస్తుందని ఎంపీ వద్దిరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్రాల మధ్య బొగ్గు, ఖనిజాలు, అటవీ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువుల రవాణా సులభతరం అవుతుందన్నారు. ఈ రహదారి గిరిజన, వెనుకబడిన ప్రాంతాల గుండా వెళ్తుందని, అనుసంధానాన్ని పెంచడం ద్వారా ఆయా వర్గాలను ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఏకీకృతం చేయవచ్చని తెలిపారు. దీనివల్ల విద్య, వైద్యం, మార్కెట్ సౌకర్యాలు మెరుగుపడతాయని వివరించారు.

## భద్రతకు వ్యూహాత్మక అవసరం


బస్తర్, సుక్మా వంటి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కేవలం అభివృద్ధి కోసం మాత్రమే కాదని, అది భద్రతా దళాలకు, పరిపాలనకు, స్థిరత్వానికి ఒక వ్యూహాత్మక అవసరమని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. ఈ కారిడార్ హైదరాబాద్ నుంచి బస్తర్ మధ్య ప్రత్యక్ష ఆర్థిక, మానవతా జీవనాడిగా మారుతుందన్నారు. ఇప్పటికే ఖమ్మం వరకు పటిష్టమైన రహదారులు ఉన్నాయని, లోపించిన ఈ కీలక అనుసంధానాన్ని పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయని అభిప్రాయపడ్డారు. ఈ రహదారి ప్రాముఖ్యతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

# ‘మెగా లోక్ అదాలత్’ పేరుతో లంచాల మేత!?

**మెట్‌పల్లి డివిజన్‌లో ‘కొందరు’ కానిస్టేబుల్‌లపై అవినీతి ఆరోపణలు?**

**కేసు ‘తెగదెంపులు’ చేసుకోవాలనుకున్న ప్రజల్లో ఆగ్రహం**

**దీన్నే ‘కీలెరిగి వాత పెట్టుడంటారా’.?**







**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** రాజీ పడడమే రాజమార్గం” అని న్యాయమూర్తులు చెబుతుంటే, పోలీసులు మాత్రం దాన్ని “లంచాలు తీసుకునే రాజమార్గం”గా మార్చుకున్నారా? ప్రజలకు త్వరితగతిన, ఉచితంగా న్యాయం అందించాల్సిన ‘మెగా లోక్ అదాలత్’ ప్రక్రియను మెట్‌పల్లి డివిజన్‌లో కొందరు కానిస్టేబుళ్లు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. చిన్నచితకా కేసుల్లో చిక్కుకుని, కోర్టుల చుట్టూ తిరిగి అలసిపోయిన బాధితులను లక్ష్యంగా చేసుకుని, ‘కేసు త్వరగా ముగిస్తాం’ అంటూ డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగులోకి రావడంతో పోలీసు వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోంది.

## అవకాశాన్ని దుర్వినియోగం చేస్తున్నారా?

‘మెగా లోక్ అదాలత్’ల ద్వారా పెండింగ్ కేసులను సామరస్యంతో త్వరగా పరిష్కరించడం ప్రధాన లక్ష్యం. కానీ ‘కోరుట్ల–మెట్‌పల్లి’లలో కొందరు పోలీసు సిబ్బంది ఈ ప్రక్రియను వ్యక్తిగత లాభానికి వాడుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోర్టుకు హాజరైన బాధితులను గుర్తించి, ‘మేము మాట్లాడితే కేసు వెంటనే క్లోజ్ అవుతుంది’ అంటూ వారిని ప్రలోభపెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కేసు ముగింపు కోసం అధికారికంగా ఎటువంటి రుసుము అవసరం లేకపోయినా, బాధితులకు అది తెలియకపోవడం వల్ల ఈ తరహా వసూళ్లు సులభమవుతున్నాయని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి.

## పునరావృతమవుతున్న వసూళ్లు!

ఇటీవల కోర్టుకు వచ్చిన ఓ వ్యక్తిని ఇద్దరు కానిస్టేబుల్‌లు సంప్రదించి ఒక్కొక్కరికి రూ.1000 ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు డబ్బు ఇవ్వలేనని చెప్పగా, ‘సరే.! కనీసం రూ.500 లైనా ఇవ్వండి’ అంటూ ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. చివరికి ఒకరికి నగదుగా, మరొకరికి ‘ఫోన్‌పే’ ద్వారా డబ్బు చెల్లించాల్సి వచ్చినట్లు బాధితుడు వెల్లడించినట్టు సమాచారం. ఇలాంటి ఘటనలు ఒక్కటే కాకుండా పలు కేసుల్లో జరుగుతున్నాయని స్థానికంగా ప్రచారం సాగుతోంది. కోర్టు పరిసరాల్లోనే ఈ వసూళ్లు జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

## బెదిరించి -- ఆశ చూపించి డబ్బుల వసూళ్లు!

‘కేసు త్వరగా ముగుస్తుంది’ అని ఆశ చూపించడం, లేదా ‘లేదంటే ఆలస్యం అవుతుంది’ అంటూ భయపెట్టడం ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఖాకీ యూనిఫాం ధరించిన పోలీసు సిబ్బంది మాటకు భయపడి చాలా మంది నోరు విప్పకుండా డబ్బులు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. కొందరు బాధితులు తమ వద్ద ఉన్న కాల్ రికార్డింగ్‌లు, డిజిటల్ లావాదేవీల ఆధారాలను బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.

## వ్యవస్థలో లోపాలే కారణమా?

చిన్న కేసుల్లోనే బాధితులు కోర్టుల చుట్టూ తిరగాల్సి రావడం, ప్రక్రియపై అవగాహన లేకపోవడం, పోలీసులపై ఉన్న భయం.. ఇవి ఈ తరహా అవినీతికి దారితీస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలు కూడా కొందరిని తప్పుదోవ పట్టిస్తున్నాయని విశ్లేషణ ఉంది. అయితే ఇవి ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి సమర్థన కాదని న్యాయవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

## నమ్మకం దెబ్బతింటోందని ఆవేదన!

ప్రజల రక్షకులుగా ఉండాల్సిన పోలీసులే లంచాలు తీసుకుంటున్నారనే భావన ప్రజల్లో పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న మొత్తాల్లోనే ఈ తరహా వసూళ్లు జరుగుతుంటే, పెద్ద కేసుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే చట్ట అమలు ప్రభావితం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## చర్యలు తీసుకోవాలని డిమాండ్!

ఈ వ్యవహారంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణం స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే సంబంధిత కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలతో పాటు అవినీతి నిరోధక శాఖకు అప్పగించాలని కోరుతున్నారు. ‘నేటి శనివారం’ జరగనున్న ‘మెగా లోక్ అదాలత్’ నేపథ్యంలో ఈ ఆరోపణలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రజలకు న్యాయం అందించే వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత పెంపు అత్యవసరమని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.. ‘కొసమెరుపు’ ఏమిటంటే ఇటీవల బాధితులు కొందరు ‘ఏసీబీ’ని ఆశ్రయించినట్టు.. ‘వారు కూడా’ అదును కోసం ‘కాచుక్కూచున్నట్టు’ గుసగుసలు వినిపిస్తున్నాయి!

# మారుమోగిన రామనామ స్మరణ..

• గ్రామగ్రామాన అన్నదానాలు





**నేటి సాక్షి, వాంకిడి:** వాంకిడి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగగా, భక్తుల రామనామ స్మరణతో ఆలయాలన్నీ మారుమోగాయి. మండల కేంద్రంలోని శివ కేశవ ఆలయంలో ఆంజనేయ స్వాములు, శివాలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు భారీగా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

అదేవిధంగా మండలంలోని బాంబర గ్రామంలో జరిగిన కల్యాణ వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ అజయ్ కుమార్ దంపతులు పాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల సమయంలో మండల కేంద్రంలో “జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్” అంటూ భక్తులు చేసిన నినాదాలతో శోభయాత్ర అట్టహాసంగా సాగింది. యువకులు, హనుమాన్ స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభయాత్రలో సందడి చేశారు. మండలంలోని బాంబర, ఖమాన, ఖిర్డీ గ్రామాలలో కూడా సీతారాముల కల్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ అన్నదాన కార్యక్రమాలు చేపట్టి, స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.





# హై వోల్టేజ్ ఫైట్

## ఆర్సీబీ వర్సెస్‌సన్‌రైజర్స్ ప్లేయింగ్ 11 ఇదే!

### పటిష్టంగా ఆర్‌సీబీ, బలహీనంగా సన్‌రైజర్స్ బౌలింగ్

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా ఈ సీజన్‌ను ఆరంభించబోతోంది. తొలి మ్యాచ్‌లోనే పటిష్ట టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)తో తలపడనుంది. ఈ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం రాత్రి జరగనుంది. ఎన్నో ఏళ్ల తర్వాత తొలి టైటిల్ గెలిచిన ఆర్‌సీబీ.. అదే జోష్‌ను ఈ సీజన్‌లో కొనసాగించాలని చూస్తోంది. 2016లో చివరగా టైటిల్ గెలిచిన ఎస్‌ఆర్‌హెచ్.. ఈసారైనా కప్ ముద్దాడాలని భావిస్తోంది. ఐపీఎల్ 2026 మొదటి మ్యాచ్ కాబట్టి ఫాన్స్ అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**పటిష్టంగా ఆర్‌సీబీ:**

ఆర్‌సీబీ బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. ఓపెనర్లుగా విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ జట్టుకు మంచి ఆరంభం ఇవ్వాలని భావిస్తున్నారు. ఆపై కెప్టెన్ రాజత్ పాటిదార్, దేవదత్ పడిక్కల్, జితేష్ శర్మ కీలక పాత్ర పోషించనున్నారు. టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్ ఫినిషింగ్ బాధ్యతలు తీసుకోనున్నారు. బౌలింగ్‌లో జోష్ హేజిల్‌వుడ్ అందుబాటులో లేకపోవడంతో.. భువనేశ్వర్, కృనాల్ పాండ్యపై కీలక బాధ్యతలు ఉన్నాయి. జాకబ్ డఫీ, సుయాష్ శర్మలపై కూడా అంచనాలు ఉన్నాయి.

**బలహీనంగా సన్‌రైజర్స్ బౌలింగ్:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. ఈసారి మంచి ఆరంభం కోసం ఎదురుచూస్తోంది. ఓపెనర్లుగా ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ దూకుడుగా ఆడనున్నారు. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ రెడ్డి జట్టును నిలబెట్టేందుకు ఉన్నారు. చివర్లో లియామ్ లివింగ్‌స్టోన్ పవర్ హిట్టింగ్‌తో మ్యాచ్‌ను మలుపుతిప్పగలడు. సన్‌రైజర్స్ బౌలింగ్ వీక్ అనే చెప్పాలి. హర్షల్ పటేల్, జయదేవ్ ఉనాద్కట్, బ్రైడన్ కార్స్, శివమ్ మావిలు ఇటీవల పెద్దగా ఆడిన దాఖలు లేవు. బెంగళూరు బ్యాటర్లను వీరు ఎలా కట్టడి చేస్తారో చూడాలి.

**పిచ్ రిపోర్ట్:**

ఎం. చిన్నస్వామి స్టేడియం బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా ఉంటుంది. చిన్న బౌండరీలు, ఫ్లాట్ పిచ్ కారణంగా బ్యాటర్లు ఈజీగా షాట్లు ఆడగలరు. ఫాస్ట్ బౌలర్లు తెలివిగా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. స్పిన్నర్లు బంతిని నెమ్మదిగా వేస్తూ టర్న్ సాధిస్తేనే విజయవంతమవుతారు. భారీ స్కోర్ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. రెండు జట్లు బలంగా ఉండటంతో ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరితమైన పోరుగా మారనుంది.

**ప్రాబబుల్ ప్లేయింగ్ XI:**

**బెంగళూరు:** ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రాజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్య, రొమారియో షెపర్డ్, భువనేశ్వర్ కుమార్, సుయాష్ శర్మ, జాకబ్ డఫీ.

**హైదరాబాద్:** హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, అన్మోల్ వర్మ, నితీష్ రెడ్డి, లియామ్ లివింగ్‌స్టోన్, హర్షల్ పటేల్, జయదేవ్ ఉనాద్కట్, బ్రైడన్ కార్స్, శివమ్ మావి.

# “ఓరి దేవుడా.. రోహిత్, గుర్తుపట్టలేకపోయాను”..

## హిట్‌మ్యాన్‌ను చూసి అందరూ షాక్



**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు రెండే రోజులు మిగిలి ఉంది. ఈ సీజన్‌లో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్ మార్పుతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆటగాళ్లను కలిసేందుకు ముంబై ఇండియన్స్ శిబిరాన్ని సందర్శించిన నీతా అంబానీ సైతం రోహిత్‌ను చూసి ఆశ్చర్యపోయారు. ముంబై ఇండియన్స్ యజమాని నీతా అంబానీ మాట్లాడుతూ.. “ఓరి దేవుడా, రోహిత్, నేను నిన్ను గుర్తుపట్టలేకపోయాను. నువ్వు ఒక చిన్న పిల్లాడిలా కనిపిస్తున్నావు.” అని అన్నారు. ఈ వీడియోను ముంబై ఇండియన్స్ అధికారిక సోషల్ మీడియా ఖాతాలలో షేర్ చేశారు. ఇందులో రోహిత్ శర్మ తన బరువును తగ్గి, ఫిట్‌నెస్‌పై ఎంతంగా దృష్టిపెట్టాడో కనిపిస్తోంది. రోహిత్ మునుపెన్నడూ లేనంత ఫిట్‌గా, సన్నగా, చురుకుగా కనిపిస్తున్నాడు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత.. 2027 వన్డే ప్రపంచ కప్ గెలవాలనే తపనతో ఉన్నాడు హిట్ మ్యాన్. ఈ ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి రోహిత్ తన ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. నిజానికి, 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో హృదయవిదారక ఓటమి తర్వాత, రోహిత్ శర్మ తనను తాను పూర్తిగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నాడట. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా తన ఫిట్‌నెస్, ఆట రెండింటిపైనా తీవ్రంగా కృషి చేశాడు. ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో రోహిత్ శర్మ అద్భుతంగా రాణిస్తున్నాడు. గత సంవత్సరం ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో సహా 202 పరుగులు సాధించాడు. తన ఈ అద్భుత ప్రదర్శనకు గాను, రోహిత్ ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’ అవార్డును గెలుచుకున్నాడు. అయితే, ఐపీఎల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా రోహిత్ శర్మకు కలిసి రావడం లేదు. లీగ్‌లో అత్యధిక పరుగులు జాబితాలో రెండో స్థానంలో కొనసాగుతున్నప్పటికీ.. ఇటీవలి సీజన్‌లలో తన మార్క్ ప్లేయర్ స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయాడు. రోహిత్ శర్మ చివరిసారిగా 2016 ఐపీఎల్ సీజన్‌లో 450కి పైగా పరుగులు సాధించాడు. అత్యుత్తమ ఐపీఎల్ సీజన్ 2013, ఆ సీజన్‌లో ఏకంగా 538 పరుగులు సాధించాడు. 2016 తర్వాత నుంచి ఫర్ఫామెన్స్ నెమ్మదిగా తగ్గుతోంది. ఈ ఏడాది మాత్రం అదరగొట్టడానికి సిద్ధంగా ఉన్నాడు.

# మైదానంలోనే కాదు..

## భారీ పారితోషకాలు అందుకోవడంలోనూ స్టార్ల పోటీ.!

### టాప్ 5 హైయెస్ట్ పెయిడ్ స్టార్స్ వీరే..



**ఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 19వ సీజన్ మార్చి 28న ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్బీసీ), సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) మధ్య బెంగళూరులో జరిగే మ్యాచ్ తో టోర్నీకి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో అత్యధిక జీతాలు అందుకుంటున్న టాప్-5 జీతగాళ్లు ఎవరో చూద్దామా..

**రిషబ్ పంత్ (ఎల్‌ఎస్జీ):**

లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్జీ) కెప్టెన్ రిషభ్ పంత్ ను ఐపీఎల్ 2025 ముందు రూ. 27 కోట్లకు కొనుగోలు చేశారు. గత సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 269 పరుగులు చేసి, ఆర్బీబీపై శతకం నమోదు చేశాడు. ఈ ఏడాది కూడా అదే జట్టుకు నాయకత్వం వహిస్తూ అత్యధిక జీతం అందుకోనున్నాడు.

**శ్రేయస్ అయ్యర్ (పీబీకేఎస్):**

పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ను రూ. 26.75 కోట్లకు కొనుగోలు అయ్యాడు. గత సీజన్‌లో 17 ఇన్నింగ్స్ లలో 604 పరుగులు చేసి జట్టును ఫైనల్‌కి తీసుకెళ్లాడు. ఈసారి కూడా అతడి నుండి భారీ ప్రదర్శన ఆశిస్తున్నారు.

**కామెరాన్ గ్రీన్ (కేకేఆర్):**

కోల్కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండర్ కెమెరాన్ గ్రీన్ ను ఐపీఎల్2026 మినీ వేలంలో రూ. 25.20 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే బీసీసీఐ ‘మ్యాక్సిమమ్ ఫీ రూల్’ కారణంగా అతను రూ. 18 కోట్ల వరకు మాత్రమే ఆడనున్నాడు.

**హేన్రిచ్ క్లాసెన్ (ఎస్ఆర్ హెచ్):**

సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ క్లాసెన్ ఈ సీజన్‌లో రూ. 23 కోట్ల జీతం అందుకోనున్నాడు. గత రెండు సీజన్‌ల్లో వరుసగా మంచి ప్రదర్శన చేస్తూ జట్టుకు కీలక ఆటగాడిగా మారాడు.

**విరాట్ కోహ్లీ (ఆర్బీబీ):**

టీమిండియా లెజండరీ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈ సీజన్‌లో రూ. 21 కోట్ల జీతం అందుకోనున్నాడు. =జదీ తరఫున అన్ని సీజన్‌ల్లో ఆడిన కోహ్లీ.. గత ఏడాది జట్టుకు తొలి టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు.

# అస్త్రశస్త్రాలతో సిద్ధమైన రాజస్థాన్ రాయల్స్..

# 17 ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా?

**ఢిల్లీ:** ఐపీఎల్ 19వ సీజన్‌లో ‘రాయల్’ విజయం కోసం రాజస్థాన్ రాయల్స్ సిద్ధమైంది. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించి, రెండోసారి ట్రోఫీని ముద్దాడాలనే కసితో ఉన్న ఆర్ఆర్‌జట్టు .. మార్చి 30న తన తొలి మ్యాచ్ ఆడనుంది. గౌహతి వేదికగా జరగనున్న ఈ హై-వోల్టేజ్ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. ఈసారి రాజస్థాన్ రాయల్స్ అభిమానులకు డబుల్ ధమాకా కలగనుంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌లో కొన్ని మార్పులు చేసిన బీసీసీఐ.. రాయల్స్ హోమ్ మ్యాచ్‌లను రెండు నగరాలకు పంచుతూ నిర్ణయం తీసుకుంది.

**మళ్లీ 2008 సీన్ రిపీట్ అవుతుందా..**

తొలి ఐపీఎల్ సీజన్ (2008)లో షేన్ వార్న్ కెప్టెన్సీలో రాజస్థాన్ రాయల్స్ అద్భుతం చేసింది. ఆనాడు ఫైనల్‌లో చెన్నైని ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. సరిగ్గా 17 ఏళ్ల తర్వాత మళ్లీ జట్టులో ఇప్పుడు అదే జోష్ కనిపిస్తోంది. ఈసారి జట్టులో రవీంద్ర జడేజా, శివం దూబే, సామ్ కర్రాన్ వంటి వరల్డ్ క్లాస్ ఆల్‌రౌండర్లు ఉండటం విశేషం. ముఖ్యంగా లోకల్ బాయ్ రియాన్ పరాగ్ తన సొంత గడ్డ గౌహతిలో చెలరేగిపోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ సీజన్‌లో యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, జోఫ్రా ఆర్చర్, ఆడమ్ జంపా, షిమ్రోన్ హెట్మేయర్, తుషార్ దేశ్‌పాండే, కుల్దీప్ సేన్ వంటి స్టార్ ప్లేయర్లతో రాజస్థాన్ జట్టు చాలా బలంగా కనిపిస్తోంది. చూడాలి మరి ఈ సారి రాయల్ విక్టరీతో రాజస్థాన్ రాయల్స్ 17 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ కప్‌ను ముద్దాడుతారా లేదా అనేది.



**గౌహతి (అస్సాం):** ఇక్కడ 3 కీలక మ్యాచ్‌లు (సీఎస్‌కే, ముంబై, ఆర్సీబీలతో) జరగనున్నాయి.
**జైపూర్ (రాజస్థాన్):** మిగిలిన 4 హోమ్ మ్యాచ్‌లు పింక్ సిటీలో జరగనున్నాయి.

**రాజస్థాన్ రాయల్స్ కీలక మ్యాచ్‌ల షెడ్యూల్ ఇదే..**

**మార్చి 30:** రాజస్థాన్ రాయల్స్ vs చెన్నై సూపర్ కింగ్స్ (గౌహతి, 7:30 PM)
**ఏప్రిల్ 7:** రాజస్థాన్ రాయల్స్ vs ముంబై ఇండియన్స్ (గౌహతి, 7:30 PM)
**ఏప్రిల్ 10:** రాజస్థాన్ రాయల్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (గౌహతి, 7:30 PM)
**ఏప్రిల్ 13:** రాజస్థాన్ రాయల్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (హైదరాబాద్, 7:30 PM)
**ఏప్రిల్ 25:** రాజస్థాన్ రాయల్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (జైపూర్, 7:30 PM)
**మే 24:** రాజస్థాన్ రాయల్స్ vs ముంబై ఇండియన్స్ (ముంబై, 3:30 PM)

# బాప్ బాప్ హోతాహై..

## పాక్ లీగ్ మొత్తం కలిపినా ఆర్సీబీ విలువకు సరిపోదు..

### లెక్కలు చూస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే!

**ముంబై:** పాకిస్థాన్ సూపర్ లీగ్ ప్రారంభమైంది. మొదటి రోజే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఇజ్జత్ మొత్తం తీసుకుంది. తొలి రోజు పలు కారణాల వల్ల వైట్ బాల్ కాస్త పింక్ బాల్‌గా మారిపోయింది. ఈ అంశంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇక లాహోర్‌లోని గద్దాఫీ స్టేడియంలో ప్రేక్షకులు లేకుండానే మ్యాచ్ ప్రారంభమైంది. షహీన్ అఫ్రిది సారథ్యంలోని లాహోర్ ఖలందర్స్ జట్టు, మార్నస్ లాబుషేన్ సారథ్యంలోని హైదరాబాద్ కింగ్స్‌మెన్‌ను 69 పరుగుల తేడాతో ఓడించింది. మరోవైపు.. రేపు ఐపీఎల్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ వర్సెస్‌పాకిస్థాన్ సూపర్ లీగ్ ప్రస్తావన వచ్చింది. ఈ రెండింటి నెటిజన్లు పోలుస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పుడు చర్చిద్దాం.. సింపుల్‌గా చెప్పాలంటే మ్యాచ్‌లు విజయవంతంగా పూర్తి చేయడానికి డబ్బుల ప్రాధాన్యత గురించి తెలిసిందే. బీబీసీ ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు డబ్బుల విషయంలో చాలా వెనుకబడి ఉంది. ఇక ప్లేయర్స్ విషయంలోనూ భారత్ ముందుంది. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే ఒక్క రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 16,700 కోట్లు ($1.78 బిలియన్). పాకిస్థాన్ సూపర్ లీగ్‌లోని మొత్తం




8 జట్లు ఫ్రాంచైజీల విలువ కేవలం పీకేఆర్882 కోట్ల పాకిస్థాన్ రూపాయలు. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే.. ఐపీఎల్ మొత్తం 10 ఫ్రాంచైజీల ఉమ్మడి విలువ సుమారు ూ11.5 బిలియన్ల (దాదాపు ₹96,000 కోట్లు) పైమాటే ఉంటుంది. ఈ లెక్కలు విన్నాక “బాప్ బాప్ హోతాహై.. బేటా బేటా హోతాహై” అనే డైలాగ్ గుర్తుకు వస్తుంది.




# పెద్ది టీజర్ విడుదల

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'పెద్ది అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా.. పాణంతో సావుకు ఎదురెళ్లే ఆట' అనే డైలాగు.. 'ఆటే నా పొగరు' అని హీరో చెప్పడం ఆకట్టుకుంటోంది . చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోన్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు 'పెద్ది' టీమ్ స్పెషల్ ట్రీట్ అందించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ భారీ రూరల్ స్పోర్ట్స్ డ్రామా నుంచి మార్చి 27న సరికొత్త టీజర్ విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన మొదటి టీజర్‌లో చరణ్ క్రికెట్ ప్లేయర్‌గా కనిపించి ఆకట్టుకోగా, తాజా టీజర్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన మాస్ అవతార్‌లో దర్శనమిచ్చాడు. కుస్తీ పోటీలలో పాల్గొనే శక్తివంతమైన యోధుడిగా ఆయన కనిపించిన తీరు అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. భారీ దేహదారుఢ్యం, కఠినమైన చూపులు, రఫ్ లుక్ అన్నీ చరణ్ పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా చూపిస్తున్నాయి. ఈ టీజర్ ద్వారా సినిమా నేపథ్యం, కథా గురించి కొంత క్లారిటీ వచ్చింది. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో స్థానిక క్రీడలు, ముఖ్యంగా కుస్తీ పోటీలు కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. చరణ్ ఫిజిక్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆమె పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండబోతుందని సమాచారం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'పెద్ది' సినిమా భారీ స్థాయిలో రూపొందుతోంది. కథ, టేకింగ్, మ్యూజిక్, యాక్షన్ అన్ని విభాగాల్లో ఈ చిత్రం కొత్త ప్రమాణాలు సృష్టించే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే టీజర్‌తోనే భారీ బజ్ క్రియేట్ చేసిన 'పెద్ది', విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.



# ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు

## నిర్మొహమాటంగా చెప్పి సాయిపల్లవి

దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో 'మలర్ టీచర్' పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. 'ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది. ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు.




# రామ్‌చరణ్.. నీ వ్యక్తిత్వమే శ్రీరామరక్ష

## తనయుడికి చిరంజీవి విషెష్

రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. 'పెద్ది' గ్లింప్స్‌తో అభిమానుల్లో జోష్ పెంచారు. కుమారుడికి శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి అరుదైన ఫొటోలను పంచుకున్నారు. 'చరణ్ బాబు.. చిన్నప్పుడు నా వేలు పట్టుకొని నడిచిన స్థాయి నుంచి.. ఈరోజు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే స్థాయికి ఎదగడం చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. సినిమా, వ్యక్తిగత జీవితాన్ని నువ్వు బ్యాలెన్స్ చేసే విధానం, కుటుంబంపై నీకున్న బాధ్యత, దేవుడిపై భక్తి, క్రమశిక్షణ, నీ విలువలు.. వీటిని చూసిన ప్రతిసారీ నీపై నా ప్రేమ, గౌరవం మరింత పెరుగుతూనే ఉన్నాయి. ఆ దేవుడి ఆశీస్సులు, అభిమానుల ప్రేమాభిమానాలు నిన్ను ఉన్నత శిఖరాలకు నడిపించాలని కోరుకుంటున్నాను' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు మై స్వీటెస్ట్ కజిన్. ఈ ఇయర్ 'పెద్ది' మూవీ పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా అంటూ అల్లు అర్జున్ తెలిపారు. 'హ్యాపీ బర్త్‌డే అన్నయ్య! నువ్వు చిన్నప్పుడు ఎంత అల్లరి చేసేవాడివో నాకు ఇప్పటికీ గుర్తుంది. కానీ ఇప్పుడు నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. ఇంతటి విజయాన్ని అందుకున్నా కూడా నువ్వు ఎంతో వినయంగా ఉంటావు. నీలో ఆ లక్షణం నాకు ఎంతో ఇష్టం. జీవితాన్ని నువ్వు డీల్ చేసే విధానం నన్ను ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తుంది. అనవసరమైన హడావుడి, డ్రామాలు లేకుండా సైలెంట్‌గా ఉంటూనే నీలోని ప్రేమను, బలాన్ని చూపిస్తావు. నువ్వే నా ధైర్యం. ఐ లవ్ యూ అని వరుణ్ తేజ్ పోస్ట్ పెట్టాడు. 'హ్యాపీ బర్త్‌డే రామ్ చరణ్. పెద్ది గ్లింప్స్ అదిరిపోయింది. ఈ సినిమాతో నువ్వు మరో బ్లాక్‌బస్టర్ అందుకోవాలని కోరుకుంటున్నా అని నారా రోహిత్ విషెష్ చెప్పాడు.

# పవన్ తనయుడితో రామ్‌చరణ్

## బర్త్‌డే విషెస్ చెబుతూ అన్నాలెజ్నెవా పోస్ట్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నేడు తన పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా, సోషల్ మీడియా అంతా చరణ్ బర్త్‌డే పోస్టులతో నిండిపోయింది. ముఖ్యంగా మెగా ఫ్యామిలీ సభ్యులు షేర్ చేసిన ప్రత్యేక ఫోటోలు, సందేశాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఇటీవల షూటింగ్ సమయంలో గాయపడినప్పటికీ, త్వరగా కోలుకుని మళ్లీ సెట్స్‌లోకి వచ్చి అభిమానులను కలవడం ఫ్యాన్స్‌కు రిలీఫ్ ఇచ్చింది. ఈ బర్త్‌డే సందర్భంగా ఒక అన్‌సీన్ ఫోటో సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజ్నెవా తన కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ తో కలిసి చరణ్ ఉన్న ఒక క్యూట్ ఫోటోను షేర్ చేస్తూ బర్త్‌డే విషెస్ తెలిపారు. 'మార్క్ మరియు మా కుటుంబం తరపున చరణ్ అన్నకు హ్యాపీ బర్త్‌డే' అంటూ ఆమె చేసిన పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంది. ఆ ఫోటోలో చరణ్ పక్కన కూర్చుని మార్క్ ఫోన్ చూస్తుండగా, చరణ్ ఎంతో ప్రేమగా అతన్ని గమనిస్తున్న తీరు నెటిజన్లను ఫిదా చేసింది. సాధారణంగా పవన్ కళ్యాణ్ కుటుంబానికి సంబంధించిన ఫోటోలు చాలా అరుదుగా బయటకు వస్తుంటాయి. అలాంటిది ఈ సందర్భంలో బయటకు రావడంతో మెగా ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# భక్తి, భావోద్వేగాల మేళవింపుగా ఇరుముడి

భక్తి, బంధాలు, భావోద్వేగాలతోపాటు... రవితేజ శైలి మాస్ అంశాల మేళవింపుతోనూ రూపొందుతున్న చిత్రమే 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర, సాయికుమార్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణని పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్లు అనల్ అరసు, రియల్ సతీశ్ నేతృత్వంలో విభిన్నమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని చిత్రబృందం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. తండ్రీకూతుళ్లుగా నటిస్తున్న రవితేజ, బేబి నక్షత్ర ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అద్భుతమైన కథ, కాన్సెప్ట్‌తో కూడిన చిత్రమిది. అయ్యప్ప మాల నేపథ్యం, అందమైన కుటుంబం, భావోద్వేగాలతోపాటు యాక్షన్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తండ్రీ కూతుళ్ల బంధం ఈ సినిమాకి కీలకం. రవితేజ ఇప్పటివరకూ పోషించిన ప్రాతలతో పోలిస్తే ఇందులో మరింత ప్రత్యేకమైన పాత్రలో కనిపిస్తార'ని సినీ వర్గాలు చెప్పాయి. అజయ్ ఘోష్, రమేశ్ ఇందిర, శ్వాసిక, మీసాల లక్ష్మణ్, రాజ్‌కుమార్ సరిరెడ్డి, రమణ భార్గవ్, కిశోర్ కంచరపాలెం, కార్తీక్ అడుసుమిల్లి, మహేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్, కూర్పు: ప్రవీణ్ పూడి.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రత్యేక పూజలు





- రాముడు చూపిన బాటలో నడవాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి
- శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి దంపతులు.. పూర్ణకుంభ స్వాగతం

**నేటి సాక్షి, మంచిర్యాల,(శ్రీధర్ దమ్ము):** శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా 7వ వార్డు, కొత్త తిమ్మాపూర్, పాత తిమ్మాపూర్ అమ్మ గార్డెన్ మరియు కేతనపల్లిలోని పలు హనుమాన్ దేవాలయాలను మంత్రి తన సతీమణి సరోజతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు చేరుకున్న మంత్రి దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. సీతారాముల కంటే ఆదర్శ దంపతులు ఈ విశ్వంలోనే లేరని, రాముడు చూపిన ధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులను ఎలా ప్రేమించాలి, కష్ట సమయాల్లో జీవితాన్ని ఎలా గడపాలి అనేది రాముడి జీవితం మనకు నేర్పుతుందని మంత్రి పేర్కొన్నారు. రామరాజ్య స్థాపన ద్వారా ఒక రాజ్యాన్ని ఎలా పరిపాలించాలో రాముడు ఆదర్శంగా నిలిచారని, మానవ జన్మ విశిష్టతను చాటిన ధర్మమూర్తి శ్రీరామచంద్రుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మతసామరస్య చాటుకున్న ముస్లిం సోదరులు




- శ్రీరామ నవమి సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ
- ఐక్యతకు ప్రతీకగా నిలిచిన సేవా కార్యక్రమం.. భక్తుల అభినందనలు

**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణంలో మతసామరస్యం వెల్లివిరిసింది. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు పట్టణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆలయాలకు తరలివచ్చిన భక్తులకు, బాటసారులకు మరియు ప్రయాణికులకు చల్లని మజ్జిగను అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ.. అన్ని మతాల మధ్య సౌహార్దం, పరస్పర గౌరవం పెంపొందించడం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మతాల మధ్య ఐక్యతను మరియు శాంతిని పెంపొందిస్తాయని తెలిపారు. ఎండ వేడిమిలో భక్తులకు మజ్జిగను అందజేస్తూ వారు చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు, భక్తులు కొనియాడారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేలా ముస్లిం సోదరులు చేసిన ఈ కృషి మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచింది.

# పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**నేటి సాక్షి,మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ 1 రాజీవ్ నగర్ లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అధికారులతో కలిసి పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటి నుండి ప్రతి రోజు చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిబంధనలకు లోబడి త్వరగా ఇల్లు నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మురుగు కాలువ సమస్య, పట్టణ ఆరోగ్య ఉప కేంద్రంలో నెలకొన్న సమస్యలు, ఇంటి పైనుండి విద్యుత్ తీగలు వెళ్లడంతో నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుందని ప్రజలు జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు త్రాగునీరు, వీధి దీపాలు, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# అక్రమ బీసీ సర్టిఫికెట్లను వెంటనే రద్దు చేయాలి




- రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుతో బీసీ జేఏసీ నేతల కీలక భేటీ
- నిజమైన బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం: సిద్ది రమేష్ యాదవ్

**నేటి సాక్షి, చెన్నూర్:** రాష్ట్రంలో ఇతర కులాలకు చెందిన వారు అక్రమంగా బీసీ సర్టిఫికెట్లు పొందుతుండటంపై బీసీ జేఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బీసీ రాష్ట్ర కార్యాలయంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులుతో బీసీ జేఏసీ చైర్మన్ సిద్ది రమేష్ యాదవ్, నాయకుడు సాధనబోయిన కృష్ణ సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సిద్ది రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. కొందరు ఇతర కులస్థులు, ముఖ్యంగా మార్వాడీలు అక్రమ మార్గాల్లో బీసీ సర్టిఫికెట్లు పొందుతూ నిజమైన బీసీల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. దీనివల్ల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అసలైన బీసీ అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇలాంటి అక్రమ సర్టిఫికెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ నాయకుడు సాధనబోయిన కృష్ణ మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో ప్రత్యేక విచారణ కమిటీలను ఏర్పాటు చేసి నకిలీ సర్టిఫికెట్లను గుర్తించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు స్పందిస్తూ.. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ అక్రమాలపై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించాలని జేఏసీ నేతలు నిర్ణయించారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని వారు స్పష్టం చేశారు.

# వైభవంగా 'సీతారాముల కళ్యాణం'

లోకకళ్యాణం కోసం ప్రత్యేక పూజలు.. భక్తుల భారీ అన్నదానం



**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గన్నేరువరం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గన్నేరువరం గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు మైలారం, సాంబయ్యపల్లె గ్రామాల్లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల కళ్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ మహోత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గన్నేరువరంలో వేద పండితులు మణిశంకర్ శర్మ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారాముల వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, లోకకళ్యాణం కోసం ఈ పూజలు జరిపించినట్లు తెలిపారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో గన్నేరువరం, మైలారం, సాంబయ్యపల్లె గ్రామాల సర్పంచులు రంగన్నవేణి లచ్చయ్య-నర్సవ్వ, గాలిపెల్లి పోషవ్వ-నరసయ్య, రమ్య-ఉదయ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు తిప్పర్తి నికేష్, పుల్లెల జగన్, గాలిపెల్లి శంకర్, పుల్లెల రామ్, విలాసాగర్ రామచంద్రం, గడ్డం గంగారెడ్డి మరియు భక్త బృందం, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరికల్‌లో సీతారాముల కళ్యాణం

భారీగా తరలివచ్చిన భక్తులు.. రథంపై స్వామివారి ఊరేగింపు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. లోకకళ్యాణం కోసం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నులపండువగా సాగింది. ఈ వేడుకను వీక్షించేందుకు మరికల్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కళ్యాణ మహోత్సవం అనంతరం స్వామివారి విగ్రహాలను రథంపై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో మరికల్ మండల తహసీల్దార్ రామకోటి, మరికల్ సీఐ భగవంతు రెడ్డి మరియు గ్రామ సర్పంచ్ చెన్నయ్యలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి, మండల నాయకులు బలగుంది హరీష్ కుమార్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కాటికొండ ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, పెంటమీద రాఘవేంద్ర, టైసన్ రాఘవేంద్ర, పి. రామకృష్ణ, గోవర్ధన్, రఘు, నాగరాజు, బొంత మొగులయ్య, ఎల్. రాములు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శివాలయం వద్ద మంచినీటి బోరు

శివస్వాముల అభ్యర్థనపై తక్షణమే స్పందించిన సూర్య మోహన్ రెడ్డి



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రం ఇందిరా గాంధీ చౌరస్తా సమీపంలోని శ్రీ నగరేశ్వర శివాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నూతనంగా బోరు బావిని ఏర్పాటు చేశారు. శివస్వాముల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి సహకారంతో, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు యుద్ధప్రతిపాదికన బోరు వేయించడంతో స్థానిక ప్రజలు, భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తున్న నాయకత్వాన్ని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బెల్లగొంది వీరన్న, పట్టణ అధ్యక్షులు హరీష్ కుమార్, యూత్ మండల అధ్యక్షుడు కాటేకొండ ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఖాజా, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎర్రగుట్టపై సీతారాముల కళ్యాణ మహోత్సవం



- చిత్తలూరులో కన్నులపండువగా స్వామివారి పల్లకి సేవ
- నేడు శ్రీరామ పట్టాభిషేకం.. భక్తులకు భారీ అన్నదానం

**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని చిత్తలూరు గ్రామ సమీపంలో గల ఎర్రగుట్ట శ్రీరామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. దేవాలయ పూజారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారిని పల్లకిలో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ వేడుకలకు మరికల్ సీఐ భగవంతు రెడ్డి, ఎస్సై రాములు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానానికి సహకరించిన జయంతి ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత భావన రాజశేఖర్, గ్రామ సర్పంచ్ మురళి యాదవ్‌లను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూజారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. శనివారం ఆలయంలో శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవైపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుత్తడి కుమార్, ధర్మకర్త జయసింహారెడ్డి, ఎం. శేఖర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, తిమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, మాధవరెడ్డి, కిష్టయ్య, మరికల్ మాజీ సర్పంచ్ గోవర్ధన్ తదితరులతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు లో-వోల్టేజ్ సెగ

- అహ్మదీపూర్‌లో విద్యుత్ కష్టాలు: 'మాదాసు' నిరసన
- సబ్‌స్టేషన్ ముట్టడి
- కేసీఆర్ హయాంలోనే నాణ్యమైన విద్యుత్.. సమస్య తీర్చకుంటే ధర్నా



**నేటి సాక్షి, గజ్వేల్:** గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ గ్రామంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేస్తూ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ నేతృత్వంలో రైతులు శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. గ్రామంలో తీవ్రంగా ఉన్న లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

### మోటార్లు నడవక పంటలు ఎండుతున్నాయి..

ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. యాసంగి సాగు సమయంలో లో-వోల్టేజ్ వల్ల బావుల వద్ద మోటార్లు సరిగా పనిచేయక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ పాత రోజులు గుర్తొస్తున్నాయని విమర్శించారు. గ్రామంలో ఇంకా సుమారు 30 స్తంభాలకు థర్డ్ వైర్ ఏర్పాటు చేయాల్సి ఉందని, వెంటనే ఆ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

### రోడ్డుపై బైఠాయిస్తాం..

అధికారులు నిర్లక్ష్యం వీడి వారం రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే రైతులు, ప్రజలతో కలిసి రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, నిజాముద్దీన్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు సంపత్ రెడ్డి, కుర్మా రాములు, మహిపాల్ రెడ్డి, వెంకట్ గౌడ్ మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "పదవి కాదు.. ప్రజలే ముఖ్యం

- జీవన్ రెడ్డి రాజీనామా.. కొప్పుల ఈశ్వర్ 'వైరల్' పోస్ట్
- బీఆర్ఎస్ గ్రూపుల్లో ఫోటో కలకలం.. గులాబీ గూటికి మాజీ మంత్రి

**నేటి సాక్షి, ఎండపల్లి:** మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. "పదవి కంటే ప్రజలే ముఖ్యమని నిరూపించిన నాయకుడు" అంటూ జీవన్ రెడ్డి నిర్ణయాన్ని కొప్పుల ఈశ్వర్ ప్రశంసించారు. ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తూ ధైర్యంగా పదవిని వదులుకున్న నాయకుడు అరుదని కొప్పుల తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా BRS FAMILY పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి కలిసి ఉన్న ఏఐ (AI) ఫోటోను షేర్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీంతో జీవన్ రెడ్డి త్వరలోనే బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకుంది. జీవన్ రెడ్డి రాజీనామా తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మార్పుకు నాంది పలుకుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలకు అతీతంగా పలువురు నేతలు ఆయన నిర్ణయాన్ని సమర్థిస్తుండటంతో, జీవన్ రెడ్డి తదుపరి అడుగు ఎటువైపు అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. మొత్తానికి కొప్పుల ఈశ్వర్ చేసిన ఈ పోస్ట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసేలా కనిపిస్తోంది.

## ఇండస్ట్రీయల్ కారిడార్ భూ సేకరణ ఆపాలి



- రాపోల్, కాలాపూర్ రైతుల పొలాలు లాక్కోవడం అన్యాయం: సీపీఎం
- ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయంపై పోరాటం ఉధృతం చేస్తాం: ఆర్. మహిపాల్

**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోల్, కాలాపూర్ గ్రామాల్లో ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న 1197 ఎకరాల భూ సేకరణను సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. రైతులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చేస్తున్న బలవంతపు భూ సేకరణను ప్రజలు ప్రతిఘటిస్తారని హెచ్చరించారు. మూడు పంటలు పండే సారవంతమైన భూములను సేకరించడం రైతులకు తీరని అన్యాయమని మహిపాల్ పేర్కొన్నారు. గతంలో భూములు పంచిన కాంగ్రెస్ పార్టీయే, ఇప్పుడు పేద రైతుల నోరు కొట్టడం విచారకరమన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల అభిప్రాయం తీసుకోకుండా నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని విమర్శించారు. బీడు భూములను వదిలి సాగు భూములను తీసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ భూ సేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరంలో రాములోరి భారీ ఊరేగింపు

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భజన మండలి, గ్రామ ప్రజలు
- ఆధ్యాత్మిక చైతన్యంతో మండల కేంద్రంలో సందడి

**నేటి సాక్షి, గన్నేరువరం,** (బుర్ర అంజయ్య గౌడ్): మండల కేంద్రంలో శ్రీరామ నవమి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. శుక్రవారం సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి భజన మండలి సభ్యులు, గ్రామ ప్రజలు కలిసి శ్రీరామ చంద్రుని భారీ ఊరేగింపును నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భజన కీర్తనల మధ్య సాగిన ఈ శోభాయాత్ర గ్రామ పురవీధుల్లో భక్తిభావాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో బొడ్డు బాలయ్య, బోయిన అంజయ్య, బోయిని మల్లయ్య, మునిగంటి లింగయ్య, కంతాల శ్రీనివాసరెడ్డిలతో పాటు మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఊరేగింపు పొడవునా భక్తులు నీరాజనాలు పలికారు.

## 'సీతారాముల కళ్యాణం'

భక్తిశ్రద్ధలతో పీటల మీద కూర్చున్న పున్నం రాజశేఖర్ దంపతులు



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** మండలంలోని దమ్మాయిగూడెం గ్రామం భక్తి సాగరంలో మునిగిపోయింది. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, గ్రామ ఉపసర్పంచ్ పున్నం రాజశేఖర్-భాను దంపతులతో పాటు నెల్లూరి ప్రసాద్-లీల, నెల్లూరి పవన్ కుమార్-నాగమణి, బోడపట్ల సతీష్-రేఖ పుణ్య దంపతులు పీటల మీద కూర్చుని కళ్యాణాన్ని జరిపించారు. ఉదయం నుంచే వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు సంప్రదాయబద్ధంగా కళ్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకరించిన పల్లకిలో స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించగా, మహిళలు మంగళహారతులతో నీరాజనాలు పలికారు. గ్రామ ప్రజలందరూ ఏకమై నిర్వహించిన ఈ వేడుకలు దమ్మాయిగూడెంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి. శ్రీ సీతారాముల ఆశీస్సులతో గ్రామం సుఖశాంతులతో వర్ధిల్లాలని భక్తులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు నరేందర్ రెడ్డి గుడ్ బై

మండల ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీకి స్వస్తి



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** కాంగ్రెస్ తిమ్మాపూర్ మండల ప్రధాన కార్యదర్శి, అలుగునూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మామిడి నరేందర్ రెడ్డి తన పదవితోపాటు పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన, తన వ్యక్తిగత కారణాలతోనే పార్టీని వీడుతున్నట్లు వెల్లడించారు. గత 20 ఏళ్లుగా పార్టీలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించిన నరేందర్ రెడ్డి, ఇంతకాలం తనకు సహకరించిన పార్టీ సీనియర్ నాయకులకు, తోటి కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సెల్ ఫోన్ దొంగల ముఠా గుట్టురట్టు

25 ఖరీదైన ఫోన్లు స్వాధీనం.. అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలోని రద్దీ మార్కెట్ ప్రాంతాల్లో ఖరీదైన సెల్ ఫోన్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను జిల్లా సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. కర్నూలు జిల్లాకు చెందిన కె.రవి (అలియాస్ గౌరి) ప్రధాన సూత్రధారిగా ఉన్న ఈ ముఠాలో మహేష్, కార్తీక్, మురళి, వెంకటేష్, తిరుపతి సభ్యులుగా ఉన్నారు. వీరు రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్లలో ప్రజల అప్రమత్తతను గమనిస్తూ, మైనర్ బాలుర సహాయంతో ఫోన్లను తస్కరించేవారు. నిందితుల నుంచి సుమారు రూ. 3,75,000 విలువైన 25 ఖరీదైన సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ మాట్లాడుతూ.. రద్దీ ప్రదేశాలలో ప్రజలు తమ మొబైల్ ఫోన్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిందితులందరూ పాత నేరస్థులేనని, వారిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఎస్ఐ రమేష్, కానిస్టేబుళ్లు రాజు, రామకృష్ణ, రవీందర్, రమేష్‌లను అధికారులు అభినందించారు.

## నాగపురిలో తీరిన నీటి కష్టాలు

రాత్రికి రాత్రే బోరు వేయించిన సర్పంచ్ బుర్రా పోచయ్య



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని 3వ వార్డు నాగపురి వాడలో నెలకొన్న అత్యవసర నీటి సమస్యకు గ్రామ సర్పంచ్ బుర్రా పోచయ్య తక్షణ పరిష్కారం చూపారు. వార్డులోని పాత బోరింగ్ దెబ్బతినడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా భోజనాల ఏర్పాట్లు ఉండటంతో నీటి అవసరం అనివార్యంగా మారింది. విషయం తెలిసిన వెంటనే స్పందించిన సర్పంచ్ పోచయ్య, పరిస్థితి తీవ్రతను గుర్తించి రాత్రి వేళలోనే కొత్త బోరు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వార్డు సభ్యులు గులాం జావిద్, కిషోర్, లావణ్య, వేణుల సమన్వయంతో చీకటిని కూడా లెక్కచేయకుండా పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. పండుగ రోజున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన బోరు వేయించడంతో గ్రామస్థులు సర్పంచ్ నాయకత్వాన్ని, వార్డు సభ్యుల కృషిని కొనియాడారు.

# జూపెడలో వైభవంగా 'సీతారాముల కళ్యాణం'

- భక్తిశ్రద్ధలతో పీటల మీద కూర్చున్న సర్పంచ్ నరేందర్ రెడ్డి దంపతులు
- బొడ్రాయి ప్రతిష్ఠాపనకు రూ. లక్ష విరాళం ప్రకటించిన తిప్పారెడ్డి దంపతులు



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** మండలంలోని జూపెడ గ్రామ పంచాయతీలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ ఏకమై ఆనందోత్సాహాల మధ్య ఈ దివ్య కార్యక్రమాన్ని జరిపించారు. గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి-జ్యోతి దంపతులతో పాటు కోట అప్పారెడ్డి-పద్మ, మందాడి నరేందర్ రెడ్డి-శైలజ, తిప్పారెడ్డి సురేందర్ రెడ్డి-స్వామి పుణ్య దంపతులు పీటల మీద కూర్చుని ఆచార సంప్రదాయాల ప్రకారం శ్రీరాముల వారి కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బొడ్రాయి వేసేందుకు తిప్పారెడ్డి శ్రీలత-శ్రీనివాస్ రెడ్డి దంపతులు తమ వంతుగా రూ. 1,00,116 విరాళాన్ని ప్రకటించి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇందుర్తి మల్లారెడ్డి, లంజపల్లి శ్రీనివాస్, మల్లారెడ్డి రామ్మూర్తి, కృష్ణారెడ్డి, మంగయ్య, పండు, వెంకన్న, మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో వైభవంగా 'సీతారాముల కళ్యాణం'



- వేడుకల్లో పాల్గొన్న వైస్ చైర్మన్ డాక్టర్ అనిత శ్రీనివాస్ దంపతులు
- రాముని బాటలో పయనిద్దాం.. శాంతిని కాపాడుదాం: డా. కొత్తపల్లి శ్రీనివాస్

**నేటి సాక్షి కొమరంభీం ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రధాన దేవాలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కొత్తపల్లి అనిత మరియు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలోని ఈఎస్ఐ అభయ ఆంజనేయ దేవాలయం, శ్రీ త్రినేత్ర శివాలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, రైల్వే రామాలయం, మారుతి నగర్ మరియు నౌగాం బస్తీలోని విద్యానగర్ ఆలయాల్లో నిర్వహించిన కళ్యాణ ఘట్టాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్-అనిత దంపతులు మాట్లాడుతూ.. లోక కల్యాణం కోరిన శ్రీరాముని ఆశీస్సులు పొందడం తమ అదృష్టమని పేర్కొన్నారు. శ్రీరాముడు ధర్మం, సత్యం మరియు న్యాయాలకు నిలువుటద్దమని, ఆయన చూపిన బాటలో పయనిస్తేనే సమాజంలో శాంతి వర్ధిల్లుతుందని వారు ఆకాంక్షించారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి ఇంట్లో సుఖసంతోషాలను నింపాలని కోరుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతో గ్రామాల్లో సి.సి. రోడ్ల నిర్మాణం

- అత్తాపూర్, పూలపల్లిలో పనులు ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రత్నం
- ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో అభివృద్ధి.. అక్నాపూర్ నవమి వేడుకల్లో పాల్గొన్న నేతలు



**నేటి సాక్షి, వికారాబాద్:** నవాబ్‌పేట్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం శ్రీకారం చుట్టారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మంజూరు చేసిన ఎన్ఆర్ఈజీఎస్ (NREGS), ఎంపీ లాడ్స్ నిధులతో అత్తాపూర్ మరియు పూలపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న సి.సి. రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రత్నం మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి నవాబ్‌పేట్ మండలంపై ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక నిధులు మంజూరు చేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు చంద్రకాంత్, ఐటీ సెల్ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రమేష్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్నాపూర్ గ్రామంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మండల బిజెపి నాయకులతో కలిసి రత్నం పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భీమ్ రెడ్డి, మల్లేశం, గోపాల్ గౌడ్, మహేందర్, రవీందర్ చారి మరియు గ్రామ పాలకవర్గ సభ్యులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపు గజ్వేల్‌లో జాతీయ లోక్ అదాలత్



- రాజీతోనే న్యాయం.. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
- ఏసీపీ నర్సింలు వెల్లడి
- కోర్టుల చుట్టూ తిరగొద్దు.. సమయం, డబ్బు ఆదా చేసుకోండి: ఏసీపీ

**నేటి సాక్షి, గజ్వేల్:** చిన్న చిన్న కేసుల పరిష్కారానికి 'జాతీయ లోక్ అదాలత్' ఒక మంచి అవకాశమని గజ్వేల్ ఏసీపీ నర్సింలు తెలిపారు. మార్చి 28వ తేదీన (శనివారం) నిర్వహించనున్న ఈ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.

## రాజీ మార్గమే ఉత్తమం..

సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు, చెక్ బౌన్స్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి రాజీ పడదగిన కంపౌండబుల్ కేసుల్లో ఉన్న నిందితులు, ఫిర్యాదిదారులు నేరుగా సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని సంప్రదించి రాజీ చేసుకోవచ్చని ఏసీపీ పేర్కొన్నారు. చిన్న కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని హితవు పలికారు.

## త్వరితగతిన పరిష్కారం..

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో తక్కువ జరిమానాతో పరిష్కారం లభించే అవకాశం ఉందని తెలిపారు. బాధితులకు త్వరగా న్యాయం చేకూరేలా జుడిషియల్ డిపార్ట్‌మెంట్ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

**నేటి సాక్షి, సిరిసిల్ల,(శివకుమార్):** జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తొందరపడి గ్యాస్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా విషయమై జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 80084 29738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతోపాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే



ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

# మలుపుల వద్ద అతివేగం వద్దు


## వాహనదారులకు సీఐ రఘుకుమార్



**నేటి సాక్షి వికారాబాద్:** ఫిబ్రవరి నెలలో బుగ్గరామేశ్వరం ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందిన ఘటనను దృష్టిలో ఉంచుకుని, ఫారెస్ట్ ప్రాంతంలోని డీప్ మలుపుల వద్ద వాహనాల వేగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వికారాబాద్ సీఐ రఘుకుమార్ తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు రోడ్డు మధ్యలో బొల్లార్డ్స్ ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించే చర్యలు అమలు చేస్తున్నామని చెప్పారు. మలుపుల వద్ద ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరమని, ఎదుటి వాహనం కనిపించకముందే ఓవర్‌టేక్ చేయకూడదని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటూ, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సీఐ రఘుకుమార్ కోరారు

# వైష్ణవి ఆలయంలో 'నవమి'పూజలు

## అమ్మవారికి పంచామృత అభిషేకాలు.. విశేష అలంకరణ



**నేటి సాక్షి, చౌడేపల్లి:** చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామంలో వెలసిన స్వయంభూ శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో వసంత నవరాత్రుల ముగింపు సందర్భంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల్లో 9వ రోజైన శుక్రవారం ఆలయ అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి, అభయాంజనేయ స్వామికి ఉదయమే పంచామృత అభిషేకాలు నిర్వహించి, రంగురంగుల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారి సన్నిధిలో సౌందర్యలహరి, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అలాగే ఆంజనేయ స్వామికి హనుమాన్ చాలీసా పఠించారు. చౌడేపల్లి, పుంగనూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# గజ్వేల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక


## సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పాలన



**నేటి సాక్షి, గజ్వేల్:** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం పథకాలను వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించారని సారిక శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. అయితే మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాత్రం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ గ్రామ గ్రామాన పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ఆయన ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమై అర్థాంతరంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నారని వివరించారు. ఇప్పటికే పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారని, త్వరలోనే మరిన్ని నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ సమిష్టిగా పని చేస్తుందని స్పష్టం చేశారు.

# సీతారాముల కళ్యాణం

## వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లావ్యాప్తంగా శ్రీరామ నవమి పర్వదిన వేడుకలు అంబరాన్నంటాయి. దారూర్ మండలం కేరెల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం, వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటలోని మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముని కృపాకటాక్షాలతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మేడిపల్లిలో రాములోరి కళ్యాణం

**సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించిన సర్పంచ్ దాసు**



**నేటి సాక్షి, మేడిపలి:** మేడిపల్లి మండల కేంద్రంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకలు ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి గ్రామ సర్పంచ్ మకిలి దాసు గ్రామ పంచాయతీ తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. మంగళ వాయిద్యాల మధ్య పురవీధుల గుండా వీటిని ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి అందజేశారు. కళ్యాణం అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాముని కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతొాషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోపారపు అర్జున్, దేశవేని కృష్ణ, ఆర్మూరి హరీష్, ఆర్మూరి వంశీ, తోపారపు నవీన్, చీపిరిశెట్టి మల్లారెడ్డి, మెట్టు ప్రకాష్, అనిల్, మహేష్, శేఖర్, గంగ రాజం మరియు గ్రామ ప్రజలు, దీక్షా స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ నాంపెల్లి లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

**దుమాల కుటుంబం ఆధ్వర్యంలో 'నవమి' వేడుకలు**



**నేటి సాక్షి, మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని దుమాల కుటుంబ సభ్యులు తమ ఆరాధ్య దైవమైన శ్రీ నాంపెల్లి లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని, అభిషేకాలు మరియు అర్చనలతో భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా దుమాల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం మరియు తమ కుటుంబ సభ్యులందరినీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉంచాలని ఆ భగవంతుని వేడుకున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దుమాల నర్సయ్య, ఫకీర్, చిన్న నర్సయ్య, పెద్ద నర్సయ్య, సాయిలు, నరేష్, అనిల్, లక్ష్మణ్, మనోజ్, హాశ్వంత్, రిషి, చెర్రీ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం

**వి.జె.ఆర్ సంస్థ చైర్మన్ చంద్రగిరి వెంకటేష్**



**నేటి సాక్షి, తొగుట,(వడ్డే నర్సింలు):** సిద్దిపేట జిల్లా తొగుట మండలం చందాపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీరామనవమి పురస్కరించుకొని హనుమాన్ ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. చంద్రగిరి వెంకటేశం ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వందలాది మంది భక్తులు, గ్రామస్తులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని భోజనం స్వీకరించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన దాతకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## గరికపాటిపై కేసు నమోదు చేయాలి

**మధ్యాహ్న భోజనంపై వ్యాఖ్యలు అనుచితం, డిబిఎఫ్**



**నేటి సాక్షి గజ్వేల్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం, గుడ్డు పంపిణీ పథకాలపై గరికపాటి నరసింహ రావు చేసిన వ్యాఖ్యలు అనుచితమని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. ఈ వ్యాఖ్యలపై గరికపాటిపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మధ్యాహ్న భోజనం పథకం పేద విద్యార్థుల పోషకాహారం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రాజ్యాంగబద్ధ సంక్షేమ పథకమని పేర్కొన్నారు. అలాంటి పథకాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ద్వారా లక్షలాది మంది విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లవుతుందని తెలిపారు. గరికపాటి వ్యాఖ్యలు సమాజంలో అసంతృప్తి, వర్గ విభేదాలు పెరిగేలా చేసే ప్రమాదం ఉందని డిబిఎఫ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో గరికపాటిపై IPC 15 A, 504, 505 వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని కోరింది. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యలు ఉన్నాయని తేలితే SCST అట్రాసిటీ చట్టం ప్రకారం కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డును సమీక్షించి వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గరికపాటి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిబిఎఫ్ హెచ్చరించింది.

# వేములవాడలో రాములోరి కళ్యాణం



- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం
- ప్రభుత్వం తరపున వేడుకల్లో పాల్గొన్న మంత్రి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు.. పూర్ణకుంభంతో ఘనస్వాగతం

**నేటి సాక్షి, వేములవాడ,(శివకుమార్):** దక్షిణ కాశిగా పేరొందిన వేములవాడ క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు కన్నులపండువగా సాగుతున్నాయి. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయ అతిథి గృహంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి బృందం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.

# తుక్కాపూర్ కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణం

- దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి



**నేటి సాక్షి తొగుట,(వడ్డే నరసింహులు):** మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం లిసిద్ధి వినాయక యూత్ అషోసియేషన్ ఆధ్వర్యశీలోలి సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో కన్నుల పండుగగా శుక్రవారం రోజున జరిగింది .కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామ పుర వీధులలో డప్పు చప్పులతో స్వామివార్లను ఊరేగింపు నిర్వహించి దేవాలయ ప్రాంగణంలో అందంగా అలంకరించిన కళ్యాణ మండపంలో అర్చకులు కళ్యాణ క్రతువును జరిపించారు. కమనీయ కళ్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను,అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తోగుట సీఐ లతిఫ్, ఎస్ ఐ రవికాంత్ దుబ్బకా ఆత్మ కమిటీ చైర్మెన్ గాంధారి నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శం



- మందమర్రి నవమి వేడుకల్లో మంత్రి గడ్డం వివేకానంద, కలెక్టర్ కుమార్ దీపక్
- రూ. 30 కోట్లతో మున్సిపల్ అభివృద్ధి పనులు: మంత్రి వివేక్

**నేటి సాక్షి, మంచిర్యాల:** శ్రీరాముడు ఆచరించిన జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని రాష్ట్ర కార్మిక, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మందమర్రి మండలం పాలచెట్టు ప్రాంతంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. తన సతీమణి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలకు నిరంతర సేవలు అందిస్తామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ వ్యాప్తంగా సి.సి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో రూ. 30 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ఒక మనిషి ఎలా జీవించాలో శ్రీరాముడు ఆచరించి చూపారని, ఆయన చూపిన నీతి, నిజాయితీ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని కోరారు. అనంతరం మంత్రి వివేకానంద జిల్లాలోని క్యాతనపల్లి, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

# చౌడేపల్లిలో కన్నులపండువగా రాములోరి కళ్యాణం

- మండలవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు
- గ్రామాల్లో విశేష పూజలు.. రాత్రి వేళ వీధి నాటకాల సందడి

**నేటి సాక్షి చౌడేపల్లి:** చౌడేపల్లి మండలవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రతి గ్రామంలోని సీతారాముల ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పల్లెల్లోనూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గడ్డంవారిపల్లి పొద్దగల వీరాంజనేయ స్వామి ఆలయంలో మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. అలాగే బిల్లేరు గ్రామంలో అగ్రహారం ఆనందాచార్యుల ఆధ్వర్యంలో కళ్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి వేళ ఏర్పాటు చేసిన వీధి నాటకాలు భక్తులను విశేషంగా అలరించాయి. చౌడేపల్లి పట్టణంలోని హరిమందరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారాములకు వివిధ రకాల అభిషేకాలు, విశేష అలంకరణలు చేపట్టారు. వాడవాడలా వెలసిన శ్రీ లక్ష్మణ హనుమాన్ సమేత సీతారామచంద్రుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి



తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలమంతా రాముని నామస్మరణతో మారుమోగింది.

# హాస్పిటల్‌లోనే 'ఆన్ సైట్ ఎఫ్ఐఆర్' నమోదు

- బాధితురాలి వద్దకే వెళ్లి ఫిర్యాదు స్వీకరించిన మేడిపల్లి ఎస్సై
- భార్యపై కత్తితో దాడి చేసిన భర్త.. తక్షణమే స్పందించిన పోలీసులు



**నేటి సాక్షి, మేడిపల్లి:** ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేసేందుకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రవేశపెట్టిన 'ఆన్ సైట్ ఎఫ్ఐఆర్' విధానాన్ని మేడిపల్లి పోలీసులు సమర్థవంతంగా అమలు చేశారు. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, బాధితురాలు చికిత్స పొందుతున్న ఆసుపత్రిలోనే ఎస్సై ఎం. శ్రీధర్ రెడ్డి ఎఫ్ఐఆర్ నమోదు చేసి వినూత్నంగా స్పందించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి చెందిన ఆలకుంట కవిత (30)కు వర్ధన్నపేట నివాసి తిరుపతితో వివాహమైంది. వీరు మూడు నెలల క్రితం కూలి పనుల నిమిత్తం పోరుమల్లకు వచ్చారు. అయితే, భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న తిరుపతి, తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈనెల 26వ తేదీ రాత్రి కవిత తన తల్లిగారి ఇంటి వద్ద ఉన్న సమయంలో తిరుపతి కత్తితో ఆమె మెడపై, కుడి చేతిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర గాయాలైన కవితను బంధువులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి తక్షణమే ఆసుపత్రికి చేరుకున్నారు. బాధితురాలు చికిత్స పొందుతున్న చోటే ఆమె నుంచి దరఖాస్తు స్వీకరించి, అక్కడికక్కడే 'ఆన్ సైట్ ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. పోలీసుల ఈ తక్షణ స్పందనపై బాధితురాలి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.